శ్రీ

# చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును


సంపుటము ౭ } చెన్నపురి హేవిళంబి నామసంవత్సర మార్గశిరమాసము { సంచిక ౬


## సర్పములు.

లోకములో సర్పజాతు లనేకములుగలవు వానిలోఁ గొన్నిటికి విషముండును, కొన్నిటికి విషముండదు సర్పశబ్దమునకు ప్రాఁకెడునదియనియర్థము ఈపాములను జంతుశాస్త్రజ్ఞు లయిదుజాతులనుగా విభాగించియున్నారు —

౧ బొఱియపాములు —ఇవియెల్లప్పుడును భూమిలోనిబిలములలో వసియించుచు నెప్పుడో కాని పయికి రాకుండును ఇవి గుండ్రనిశరీరమును, పొట్టితోఁకయు, చిన్ననోరును, సూక్ష్మములయినపండ్లును, కలవిగానుండును ఇవిపురుగులను తిని బ్రతుకును

౨ నేలపాములు —ఇవి భూమియొక్కయుపరిభాగమునందే వాసము చేయుచు, అప్పుడప్పుడు పొదలమీఁదికిప్రాఁకును ఇవి యెప్పుడైనను నీటిలోఁ జొచ్చుటయుఁగలదు ఇవి యెలుకలు మొదలయిన మెట్టజంతువులను పట్టి భక్షించును


3 చెట్టుపాములు —ఇవి పొదలమీఁదను చెట్లమీఁదను విశేషకాలము పుచ్చుచుండును వీనిశరీరము మిక్కిలి సన్నముగానుండును ఇవితోఁకనుచుట్టి చెట్లకొమ్మలు మొదలైనవానిని పట్టుకొఁగలవు ఈజాతిపాములలో ననేకములకు దేహములమీఁద సుందరములైన తళతళలాడెడు రంగులున్నను వానిలో నెల్ల ఆకుపచ్చరంగుముఖ్యమైనదిగానుండును ఇవి తొండలుమొదలైనవానిని తినును

౪ తియ్యనీటిపాములు —ఇవి చెఱువులు మొదలయిన మంచినీటిపట్లయందు వసించుచు, కప్పలు చేఁపలు లోనగుజలజంతువులను భక్షించును వీనికి ముక్కురంధ్ర

ములు ముట్టికొన నుండును. ఈజాతిసర్పములలో నేవియు విషముగలవికావు ఇవి తక్కినపాములవలె గుడ్లుపెట్టక పిల్లలను కనును

౫ ఉప్పునీటిపాములు—ఇవి సర్వదాసముద్రములో వసించుచు, ఎప్పుడైనను మెట్టకువచ్చుచుండును వీనితోఁక పొట్టిగానుండును వీనికిని ముక్కురంధ్రములు ముట్టికొననేయుండును మంచినీటిపాములవలెనే యివియు గ్రుడ్లుపెట్టక పిల్లలనే పెట్టును ఈజాతిపాములన్నియు విషముగలవి ఇవిసముద్రపు చేఁపలు మొదలైన వానిని తినును

భూమిమీఁద సర్పజాతులలో నూఱులకొలఁది భేదములున్నవి అయినను వానిలో నలువది యేఁబది జాతులుమాత్రమే విషముకలవిగానున్నవి ఈభరతఖండము నందుఁ గలవిషసర్పములలోనెల్లను త్రాఁచుపాము మిక్కిలి క్రూరమయినది దాని విషమమోఘమయినది, త్రాఁచుపాముకాటునకు తిరుగులేదు అదితిన్నఁగా కాటువేసినచో నిరువదినాలుగుగంటలలోపల చావునిశ్చయము కఱచిన యైదునిమిషములలోపలనె ప్రాణములు విడిచినవారును గొంద ఱందందుఁగానఁబడుచున్నారు కోఱలులోఁతుగా దిగినను గంటిలోతగినంత విషముపడకపోయినప్పుడు మాత్రము కొంతిసేపు దేహముతెలియక మూర్ఛపోయియున్నను సర్పదష్టుఁడుబ్రతుకును మంత్రమువేయుటచేత బ్రతికనట్లుచెప్పఁబడువారందఱును నిట్టివారే మంత్రములచేత బ్రతికెడువారు మంత్రములు వేయకపోయినను బ్రతుకుదురు ముడుచుకొనియున్నప్పుడు త్రాఁచుపామురూపమీక్రిందిరీతిగానుండును —



త్రాఁచుపాముయొక్క విషమునకమోఘమయిన విఱుగుడుమందుసహితమీ వఱకు దొరకలేదు త్రాఁచుపామువిషము పసపు రంగుకలదయి మిక్కిలిచిక్కగా నుండును దీనిని గరళమందురు తలపట్టుకొని పిండినచో గరళముబొట్లుబొట్లుగాపడును ఇదిరక్తములో చేరినప్పుడుమాత్రమే విషమగును పుండేమియు లేనిపక్షమున గరళ

మును నోటిలోవేసికొని రుచిచూడవచ్చును మనవా రనేకౌషధములలో గరళము వేసి రోగపీడితులకు సేవింపనిత్తురు త్రాచుపాములు పదునెనిమిది మొదలుకొని యిరువది యైదువఱకును గ్రుడ్లు పెట్టును, ఈగ్రుడ్లు చర్మమయమయి తెల్లగా పావురపుగ్రుడ్లంతలేసి యుండును త్రాచుపాములు పగటిపూటకూడ సంచరించుచున్నను, ఎరనిమిత్తము ముఖ్యముగా రాత్రులయందు సంచారము వెడలును ఆకాలమునం దవి పగటికంటె నెక్కువ చుఱుకుతనముకలవిగానుండును అవి కప్పలను, చేఁపలను, ఎలుకలు మొదలయిన చిన్నజంతువులను, పురుగులను, పక్షిగుడ్లను, తినిపొట్టపోసికొనును ఆహారము కాని, ఒక్కనీటిబొట్టుగాని లేక యవి నెలలకొలఁది బ్రతుకును ఈహేతువుచేతనే మనవారు వీనిని వాతాశనములని చెప్పుదురు త్రాచులు నీటిలోఁబడి వడిగా నీఁదుటయే కాక చెట్లనుసహిత మతివేగముగా ప్రాఁకియెక్కఁగలవు ఈపాములు పుట్టలలో మాత్రమే కాక పూరియిండ్ల కప్పులలోను, గోడలరంధ్రములలోను, కూలిపాడుపడిన యిండ్లలోను, కట్టెలు తాళ్లు మొదలైనవాని గుట్టలలోను, కోళ్లగుడిసెలలోను, గడ్డిలోను, నాగ(బొమ్మ)జెముడు డొంకలలోను, కూడ తఱచుగా కానఁబడును దొడ్లయావరణములకు బొమ్మజెముడు వేయకుండుటయే కాక యిండ్లసమీపమునందు కట్టెలగుట్టలు మొదలయినవి చేర్పకుండుటమంచిది వర్షాకాలమునందు నదులు మొదలయినవాని ప్రవాహము లతిశయించి పుట్టలనుముంచివేసినప్పు డవి నిలువతావులేక సురక్షితముగా నుండుటకయి గ్రామములలోనికివచ్చి రాత్రివేళ నేమఱుపాటున త్రొక్కినవారిని కఱుచును మనభరతఖండమునందు ప్రతిసంవత్సరమును పాముకాటువలన నిరువదివేల జనులు మృతినొందుచున్నారు త్రాచుపాము నిష్కారణముగా మనుష్యుల నెప్పుడును కఱువదు అదిరేఁగినప్పుడుగాని త్రొక్కఁబడినప్పుడుగాని యాత్మసంరక్షణార్థమయి కాటువేయును అది రాత్రివేళ నెరనిమిత్తమయి సంచరించునప్పుడు భూమిమీఁదపరుండి నిద్రించుచున్న మనుష్యులమీఁదినుండి ప్రాఁకిపోవును, అట్టిసమయమునందు మనుష్యు లులికిపడి కదలినపక్షమున బెదరి కాటువేయును కాఁబట్టి మనుష్యులు సాధ్యమైనంతవఱకు నేలమీఁదపరుండక మంచములమీఁదనే పరుండవలయును ఒకవేళ నేలమీఁదనే పరుండవలసిన యావశ్యకము తటస్థించినను, పాములు సాధారణముగా గోడయోరలనుండి ప్రాఁకునుగనుక గోడచేరువను శయనింపక నట్టింటను పండుకొనవలయును అది కోపమువచ్చినప్పుడు శరీరముయొక్క ముందుభాగమును పయికెత్తి, బుసకొట్టుచు పడగనువిప్పి, ఒడుపువేయుటకయి తల వెనుకకు మళ్లించి, ఊచవలె నొక్కదెబ్బను ముందుకుఁజొనిపి కాటువేయును. అట్టిసమయమునందు కోఱలు చర్మముయొక్క పయిభాగమునే గీచుకొనిపోయినను, పాము బలహీనమయి యలసి


పోయినను, అదివఱకు వేనిమీఁదనైనను కాట్లువేసియుండినను, దానికాటంతయపాయకరమైనదిగానుండదు బలిష్ఠమయినపాముచేఁ గఱువఁబడి విషము పెద్దరక్తవాహికలోఁ బ్రవేశించిన పక్షమున, చావునిశ్చయమగుటయేకాక యట్టివా రరగంటలోపలనె చత్తురు ఈవిషసర్పములను జంపించుటకయి దొరతనమువారు ప్రతిసంవత్సరమును విశేషవిత్తమును వ్యయపెట్టుచున్నారు జనులీవిషయమున దొరతనమువారికి సహాయులుకాక పాముచిక్కినప్పుడు సహితము చంపక మూఢత్వముచేత దానిని పూజించుచున్నారు నాగులచవితియనియు, సుబ్రహ్మణ్యషష్ఠియనియు, పుట్టలలో పాలుపోసి పూజించుటకయి మనదేశమునందు ఎందఱు స్త్రీలును పురుషులును పుట్టలువెదకుకొనుచు తిరుగుచున్నారు? తమయింటి స్త్రీలు మూఢత్వముచేత నిట్టియవివేకకార్యమునకుఁబూనినప్పుడు చదువుకొన్నవారు సహితము కొందఱు వారింపక యుపేక్షించి యూరకుండుట శోచ్యముగానున్నది

త్రాచుపాములు సంవత్సరములో ననేకపర్యాయములు కుబుసమువిడుచును, వానిపండ్లు సహితము పలుమాఱూడిపోయి మరలమరల మొలచుచుండును మనదేశమునందు పాములవాండ్రును కోఱల నూడఁబెఱికి త్రాచుపాములను బుట్టలలోఁ బెట్టి యాడించుచుందురు పాములవాండ్రు నాగస్వరము పట్టి యాడించుచుండునపుడు



బుట్టలోనుండిపయికిలేచి పడగలువిప్పుకొని యిటునటునాడుచు, నాలుకలల్లార్చుచు, నడుమనడుమ బుస్సుమని కాటువేయఁబోవునట్లుగా నాగసారము మీఁదికి తలఁజొనుపుచునుండఁగాఁ జూచుటకెంతో ముచ్చటగానుండును పాములవాండ్రు కొందఱు కోఱల నూడఁబెఱుకకయే విషమునుమాత్రము పిండివేసి పాములనాడింతురు ఊడఁదీయఁబడిన కోఱలుగాని పిండఁబడిన గరళముగాని నెలదినములలోపల మరల యథాప్రకారము పూర్ణముగావచ్చును కొందఱు పాములవాండ్రు కోఱ్ఱలనూడఁదీయకయు విషము పిండకయు నజాగరూకులయి పాములనాడించుచుండుటయుకలదు అట్టివాండ్రప్పుడప్పుడేమఱుపాటున పాముచేఁగఱువఁబడి స్వర్గస్థులయి తమయజాగ్రత్తవలని ఫలము ననుభవింతురు మణిరాళ్లని చెప్పఁబడి విషమెక్కకుండుటకయి యితరులకమ్మఁబడెడి


రాళ్లాసమయమునందు వాండ్రకెంతమాత్రమును ప్రయోజనపడవు పామునకు పైదౌడయందు రెండుకోఱలు వంపుగానుండును అవి వెనుకవైపునకు వాలియుండి యుద్రేకము కలిగినప్పుడు పైకిలేచి కాటువేయుట కనుకూలపడును, అప్పుడు వాని మొదటనున్న తిత్తులలోని విషము కోఱలలోనికిదిగి కోఱలకడుగువైపున కాలువవలెనుండు సందుగుండ గాయములోపడి రక్తములోనుండి ప్రవహించి హృదయమునకెక్కి హృదయవ్యాపారమును మాన్పివేయును పడగవిప్పిన నాగుఁబాము క్రింది విధముగానుండును —



౮. పడగపయినుండెడి యర్ధవలయాకారమయిన గీతలను మనవారు కృష్ణపాదములందురు త్రాచుపాములు కొంతకాలమునకు మచ్చికపడి పెంచినవారి మెడకును చేతులకును చుట్టుకొని యాడుచు నేమియు హానిచేయకుండును. సింహళద్వీపమందు ధనసంపన్నుఁడైన గృహస్థుఁడొకఁడు తనయిల్లుకాచుటకయి కుక్కలకు బదులుగా పాములను పెంచెననియు, అవిరాత్రులువిడిచిపెట్టఁబడి యింటనున్నవారికి హానిచేయక యెల్లచోటులఁ దిరుగుచుండుననియు, పాములకు భయపడి దొంగలాధనవంతుని యిల్లు చొచ్చుటకు సాహసింపకుండిరనియు, ఒకజంతుశాస్త్రజ్ఞుఁడు సింహళద్వీప జంతుచరితమునందు వ్రాసియున్నాఁడు త్రాచుపాము లయిదాఱడుగుల పొడుగుండును పాములకు పయికిఁగనఁబడు చెవులులేవు, వానికికాళ్లు సహితము లేవు అవి ప్రక్కయెముకల

యొక్క సాయముచేత నత్యంతవేగముగాఁ బరుగెత్తఁగలవు అయినను నున్నగానుండు ప్రదేశములయం దవి తిన్నగానడవలేవు అందుచేతనే యవి పాలగచ్చుచేసిన నేలలమీఁదను గోడలమీఁదను ప్రాఁకలేకపోవుటయే కాక, సకినెలులేక చిత్రికఁబట్టిన నున్నని కోళ్లుగల మంచముమీఁది కెక్కలేవు

త్రాచుపాములుగాక పొడపాములు, కట్లపాములు, పరుగుడుపాములు, మొదలయిన విషసర్పజాతు లనేకములుగలవు ఈపాములకు ముంగులు, పందులు, మేఁకలు మొదలగుమృగములును, గరుడపక్షులు, నెమళ్లు మొదలైనపక్షులును, సహజశత్రువు లగుటచేత పాముల నవి నాశముచేయుచుండును. విషము లేకపోయినను విషముగల సర్పములకంటె నధికాపాయకరమైనదియు ముంగులు మొదలగువానికి లోఁబడనిదియు నైన యొకగొప్పసర్పముగలదు దానిని కొండచిలువయందురు కొండచిలువయొక్క రూప మీరీతిగానుండును —



ఈజాతిలోని పెద్దవి ముప్పదియడుగుల పొడుగువఱకు నుండును అవి చక్కఁగా నీఁదఁగలవు, పరుగెత్తఁగలవు, వృక్షములెక్కఁగలవు అవి జంతువులు సాధారణముగా దాహముతీర్చుకొనుటకయి పోయెడు జలాశయముల సమీపమున దాగియుండి వాని మీఁదఁబడి పండ్లతో గట్టిగాకఱచి పట్టి తన శరీరమును వానిదేహమునకు చుట్టఁబెట్టి బిగించును ఆచుట్టలయొక్క బిగిచేత నెంతబలిష్ఠమయిన జంతువయినను పటపట నెముకలువిఱిగి చచ్చిపోవును ఈవిధముగా కొండచిలువ దున్నపోతులు దుప్పులు మొదలయిన పెద్దజంతువులను సహితము నలిపి చంపివేయఁగలదు దానిపండ్లు వెనుకవైపునకు వంగియుండునుగాన దానినోటఁబడిన జంతువు విడిపించుకొని మరల నీవలఁబడనేరదు జంతువు చచ్చినతరువాత దానిని నఖశిఖాంతము నాకి, ఉమ్మితో పదునుచేసి కొండచిలువ జంతువునంతను మెల్లమెల్లగా నొక్కసారిగా గుటుక్కున మ్రింగివేయును అట్లుమ్రింగఁబడినజంతువు దున్నపోతేయయినను, కొమ్ములతోను గిట్టలతోను లోపలికిఁబోయి పయికెత్తుగాఁగనఁబడుచుండును ఇట్లుదానిగర్భములోఁ జొచ్చిన జంతువు నెలదిన


ములకుఁగాని పూర్ణముగానఱుగదు ఆజంతువు జీర్ణమగువఱకును కొండచిలువ మత్తెక్కిపడి యుండును నెలదినముల కాజంతువు జీర్ణమయి మత్తుపోయినవెనుక మరల నది యెరనిమిత్తమయి సంచారము వెడలును ఒకానొక సమయమునందు కొండచిలువలు మనుష్యులను సహితము పట్టితినును

ఒక్కకొండ చిలువమాత్రమే కాక తక్కినపాములన్నియుకూడ తమదేహమున కంటెను స్థూలములయిన జంతువులను మ్రింగును కొన్నిపాములు జంతువులను బ్రతికి యుండఁగానే మ్రింగివేయును ఒకపాము నోరుతెఱచినప్పటి కావఱకు మ్రింగఁబడి యున్న కప్పయొకటి గుబాలునలోపలినుండి దుమికెనఁట ఇంకొకపాము కప్పను మ్రింగఁగా దానికూఁత కొన్నినిమిషములవఱకును లోపలినుండి వినఁబడుచునేయుండెనఁట ఎరమ్రింగిన తరువాత పాముయొక్క చర్మము పైకిసాగి యెత్తుగానుండి మ్రింగఁబడినజంతువు క్రమక్రమముగా లోపలికిఁ బోవుచుండుట పైకి కనఁబడుచునే యుండును


అక్కడక్కడ మనభరతఖండమునందును ముఖ్యముగా బర్మాదేశమునందును విషముగల యొకజాతి భయంకరమైన వృక్షసర్పమున్నది అది సామాన్యముగా పాములనుభక్షించియే బ్రతుకును దానిపొడుగు పంద్రెండడుగులకంటెను హెచ్చుగా నుండును, దానితోఁక రెండడుగులకంటె పొడుగుగానుండును త్రాచుపామువలె దానికని పడగయుండునుగాని యంత పెద్దదిగానుండదు అది సాధారణముగా చెట్ల తోఁటలలో వాసముచేయుచు నప్పుడప్పుడు చెట్లకొమ్మలనడుమఁ బండుకొని యుండును ఈపాము త్రాచు పామునకంటె నెక్కువ సాహసముకలదయియుండుచే నధికాపాయకరమైనదిగానున్నది పాములవాఁడొకఁడు దీనినిపట్టుకొనఁబ్రయత్నించుచున్నప్పుడు మణిబంధముమీఁద కాటువేయఁగా వాఁడు కొన్ని నిమిషములలోనే ప్రాణములువిడిచెను ఇంకొకసారి బర్మాదేశములో నొకపెద్ద యేనుఁగొక చెట్టుమీఁదితీగెను లాగుచుండఁగా, ఈచెట్టుపామొకటి దానిరెండుకనులనడుమ నొసటను కాటు వేసెను ఆయేనుఁగు తెలివితప్పిపడి మూడుగంటలకాలములో మృతినొందెను

అమెరికాఖండమునందు త్రాచుపామువలెనే యపాయకరమైనవిషసర్పమొకటి కలదు దానితోఁకను గిలకవలె గలగలలాడెడు పొలుసులుండుటచేత దానిని గిలక పామని వాడుదురు అదికొన్నిసమయములయం దాఱడుగులవఱకు నెదుగును దాని మధ్యభాగము మనుష్యుని కాలంతలావు గలదయియుండును, దానివీపు పసుపువర్ణముతో మిళితమయిన బూడిదరంగు కలదిగానుండును అది నడుచునప్పుడు ముప్పదిగజముల దూరమువఱకును దానితోఁక చప్పుడు వినఁబడును అందుచేత జంతువులాధ్వనివిని

యపాయమునుండి తప్పించుకొనును అది నడుచుచున్నప్పటికంటె నిశ్శబ్దముగానున్నప్పుడు మనుష్యులుదానికెక్కువ భయపడుదురు గిలకపాముయొక్క స్వరూపము క్రిందిపటమునఁ జూపఁబడియున్నది.—



తన కలజడికలుగఁజేసినప్పుడును భయపడినప్పుడునుతప్ప, గిలకపాము తనకాహారముకానిజంతువుల నెప్పుడును కఱువదు పొలములలోవీనిబాధ యెక్కువగానుండునప్పు డక్కడిజనులు పందులను పెంచుదురు అవికొంతకాలములోనే పాములనన్నిటినిజంపితినివేయును తక్కినపాములకువలెనే దీనికిని నాలుక చీలికలై యగ్రమునందు రెండుపలవలుకలదిగానుండును ఈనాలుక కొనతోనే పాములు వస్తువులను తాఁకి తెలిసికొనును, ఈపాము మిగిలినపాములవలెనే తనకంటెస్థూలములయిన జంతువులనుబట్టి మ్రింగివేయఁగలదు సర్పజాతికి దౌడలు మిక్కిలి పెద్దవిగానుండుటచేత నవి నోరు పెద్దదిగాతెఱచి పెద్దజంతువులను నోరఁద్రోసికొని యవలీలగా మ్రింగఁగలవు గిలకపాముయొక్క శిరస్సీక్రిందిపటమునఁ జూపఁబడియున్నది —



అందుచేత మూఢులలో నూటికి వేయిటికి నొకఁడొకఁడు మతోన్మాదముచే నట్టివేషము వేయుచుండుటయు తక్కినవారట్టి వారిని మహాత్ములని గౌరవించుచుండు టయు నిప్పటికిని దటస్థించుచున్నది పామరులలో నిట్టి విశ్వాసముండుట వింతగాదు చదువుకొన్నవారిలో నట్టి నమ్మకముండుట మొదటివింత, విద్యాధికులు విభూతిధార ణాదులకు నూతన హేతుకల్పనముచేసి వాని మహిమలను స్థాపింపఁజూచుట వింతపై వింత తామిప్పుడు చదువుకొన్న నూతనశాస్త్రముల సాహాయ్యమువలనను బుద్ధిబలము వలనను నూతన హేతువులను కల్పించి పెనఁగులాడుచుండుటచేత దేశాభివృద్ధికి నిరోధము కలుగుటయేకాక విద్యాధికులకు సత్యగ్రహణాదరమును మట్టుపడును కాఁబట్టి విద్యాధికులు సత్యగ్రహణపరాయణులయి సత్యమెందున్న నంగీకరించుటకును, అసత్య మెందున్న నిరాకరించుటకును, సత్యము కొనిపోయినదారినే నడుచుటకును దృఢనిశ్చయము చేసికొనవలెను అట్టి దృఢనిశ్చయము దేశాభివృద్ధి కత్యావశ్యకము.

మన చదువుకొన్నవారిలోఁ గనఁబడుచున్న యింకొకలోపము నిజమైన దేశాభిమానము లేకపోవుట నిజమైన దేశాభిమానికి లక్షణము దేశమునందలి సమస్త జనుల మీఁదను ప్రేమాధిక్యముకలిగి సమస్త విషయములలోను దేశము వృద్ధినొందుటకుఁ దగిన ప్రయత్నముచేయుట దేశాభివృద్ధికి జనులలోఁగల లోపములను సంస్కరించుటయు నితరులలోఁగల గుణములను గ్రహించుటయు నావశ్యకములు ఈరెండు పనులును జరగక దేశమెప్పుడును వృద్ధినొందదు చదువుకొన్నవారిలో ననేకులిప్పుడీసత్యములను దృష్టియందుంచక పూర్వాచారములను పొగడుటయే దేశాభిమానమని యెంచి మనవారిలోఁగల దురాచారములు సహితము సదాచారములని స్తోత్రపాఠములుచేసి జనులలో గర్వమును వృద్ధిపఱుచుచు, ఇతరదేశములవారి సదాచారములు సహితము దురాచారములని దోషారోపణముచేసి జనులలో ద్వేషమును బురికొల్పుచు, దేశాభివృద్ధికి ప్రతిబంధకులగుచున్నారు జనులవలన మెప్పొందుటకయి స్తుతిపాఠములుచేయువారు దేశమునకు శత్రులును దురభిమానులునుగాని నిజమైన యభిమానులును మిత్రులునుగారు తమ పూర్వులును తామును లోకములో నెల్లవారికంటె నధికులమన్నగర్వము జనసంఘములో వ్యాపించి స్థిరపడినపక్షమున దేశము బాగుపడదు కాఁబట్టి దేశాభిమానలేశముగల ప్రతిపురుషుఁడును సమస్తమును బట్టువలె పొగడెడు పాఠకవృత్తి నవలంబింపక యేయేవిషయములయందు లోపములుగలవో వానినెల్ల విప్పిచూపి, దేహారోగ్య విషయమునందైనను వాణిజ్యవిషయమునందైనను కృషివిషయమునందైనను రాజ్యాంగ విషయములయందైనను నీతివిషయమునందైనను మతవిషయమునందైనను కులాచార విషయమునందైనను మఱి యేవిషయమునందైనను వృద్ధినొందుటకుఁదగిన మార్గములను జనులకు జంకులేక

తెలిపి నిర్భయముగా పనిచేయవలెను అట్లు పనిచేయువారే జనులకు నిజమైన నాయకులయి కాలక్రమమున జనులను నడపుటకును దేశాభివృద్ధి చేయుటకును శక్తులగుదురు ఇట్టి పరిశుద్ధచింతతోఁ బనిచేయక స్వప్రయోజనము నపేక్షించియు ప్రజానురంజనమును గోరియు మూఢజనుల యిష్టానుసారముగా వర్తించువారు కొంతకాలము పేరొందినను తామనుకొనునట్లు జనులను నడుపువారుగాక మూఢజనులచేతనే నడపఁబడువారయి వారి యజ్ఞానమునకు దాసులయి దేశాభివృద్ధికి విఘ్నముకలిగించు కుక్షింభరు లగుదురు మూఢులను దన మార్గమునకుఁ ద్రిప్ప సాహసింపఁ జాలక తాను మూఢమార్గమునఁ దిరిగి మెప్పొందువాఁడు తాను నేర్చిన విద్యకును వివేకమునకును నవమానము దెచ్చినవాఁడగును కాఁబట్టి విద్యావివేకమహితుఁడైన ప్రతిపురుషుఁడును ప్రజలమెప్పుకొఱకు పూనెడు కపటదేశాభిమానమును మాని దేశముయొక్క యభివృద్ధికొఱకుఁ గావలసిన నిర్వ్యాజదేశాభిమానమును పూనవలయును

చదువుకొన్నవారిలోఁ దఱుచుగాఁ గనఁబడుచున్న యింకొకలోపము క్రియావంతులంతగా లేకపోవుట. విద్యాధురీణులలో వాక్శూరులు లెక్కకెక్కుడుగా నెల్లయెడలను గానఁబడుచున్నను కార్యశూరు లెక్కడనో నూటికికోటికి నొక్కఁడుగాని కానఁబడకున్నారు అనేక స్థలములలో విద్యావంతు లనేకులు వాక్శూరత చూపవలసి వచ్చినప్పుడు సభాభవనములలో మేఘగంభీర భాషణములతో నానావిషయములను గూర్చి వ్యాఘ్రములవలె బొబ్బరించుచు వాగ్ధారాప్రవాహమును నిరర్గళముగాఁ బఱపినను, కార్యశూరత చూపవలసి వచ్చినప్పుడు నివాసభవనములలో ముసలమ్మలముండఱ నోరులేవక తాము ధర్మమని నమ్మినదాని ననుష్ఠింపవలసిన పురుషలక్షణమగు ధీరతనువిడనాడి యూఁడువారిని శరణొందఁదగిన పోటుబంట్లగుచున్నారు. ధర్మమార్గమున నడుచుటకుఁ జాలినంత పౌరుషములేని వాక్శూరులలోఁ గొందఱు తమ యశక్తతను గప్పిపుచ్చుటకో తమయద్భుత యుక్తికల్పనా సామర్థ్యమును లోకమునకుఁ జూపి ప్రసిద్ధులగుటకో మనలో పూర్వమున్నవన్నియు మంచివేయనియు వానిలో వేనిని మార్పవలసిన యావశ్యకములేదనియు వాదించుచు స్వవాదోపబలార్థముగా శాస్త్రములను శరణొందుచున్నారు ఎన్నఁడో నూఱులకొలఁది సంవత్సరముల క్రిందట నప్పటి వారిస్థితి కనుకూలముగాఁ జేయఁబడిన విధులే యెల్లకాలమును స్థితిభేదములేక యెల్లవారికిని ననుష్ఠేయములని చదువుకొన్నవారు వాదించుట యత్యద్భుతముగా నున్నది అద్భుతముల కెప్పుడును కొఱఁతయుండదు ఈయద్భుతమునకుఁ గారణమైన రహస్యమొకటి యున్నదని కొందఱు భావించుచున్నారు. ఆరహస్య మేదియందురేమో కష్టములకు భయపడుటకంటె వేఱొదియులేదు. కష్టములులేక యేసత్కార్యమును నెఱ

వేఱదు కష్టములులేని దేశాభిమానమే యుండదు గాయములకు వెఱచి మూలదాఁగి యుండు రణశూరుఁడెంతయు నుండఁడు ప్రజాక్షేమమును వృద్ధినిగోరెడు నిక్కమైన కార్యశూరుఁ డెట్టిప్రయాసమునైనను గణింపకయోర్చి పాటుపడవలెను శుద్ధహృదయముతో నిరంతర కృషిచేయుధీరున కాకష్టములే యుత్సాహజనకములయి కార్యసాఫల్యమున కనుకూల సాధనములగును కార్యశూరతలేని యధీరునిమనస్సునకు లేనికష్టములును పెక్కులు పొడకట్టును అతనికి దారిపొడుగునను వ్యాఘ్రములవలె కష్టములడుగడుగునకును గనుపట్టుచుండును అతఁడు శ్రమపడి తన బుద్ధిబలమును వినియోగించి యెన్నికష్టములను గల్పింపఁగలిగినను, అవి దుర్లంఘ్యములని చూపుట కెన్ని యుపాయములు పన్నఁగలిగినను, వానిలో నొక్కకష్టమునైనను నిస్తరించుటకు శక్తుఁడుగాక తుదకేమియుఁ జేయలేనివాఁడగును తానది యర్హకృత్యమని యెఱిఁగియు జనులేమనుకొందురోయని సంశయించు బుద్ధిమంతుఁ డెప్పుడు నేపనియుఁ జేయఁడు అట్లు చేయకపోవుటకుఁ గారణము దృఢచిత్తము లేకపోవుటగాని కార్యగౌరవము తెలియకపోవుటకాదు మొదటినుండియు దృఢచిత్తత నభ్యాసము చేయనివా రెంత తెలిసినవారను ధీశాలురయినను లక్షయుపాయములను జెప్పఁగలుగుదురుగాని యొక్క కార్యమును పూని నిర్వహింపఁజాలరు కొందఱికి సదుద్దేశములేయుండినను, అభ్యాసములేమిచే నవి కార్యకారులుకావు సత్కార్యాచరణమునందలి యుత్సాహమును స్థైర్యమును గూడ బాల్యమునందే యభ్యాసము చేయవలెను, అవి మొదట నుపేక్షింపఁబడినచో నాకాలము దాటినతరువాత పట్టుపడవు కాఁబట్టి దేశాభిమానులు విద్యార్థులుగా నున్నకాలమునుండియు స్వసుఖమును కుటుంబసుఖమును జూచుకొనుచుండునట్లే లోకసుఖమునుగూడ నొకకంటఁ జూచుకొనుచుండుట కభ్యాసము చేయవలెను.

ఇట్టి యభ్యాసముచేయని విద్యావంతులలో నభివృద్ధికి విరోధులుగా నుండెడువారిని గొందఱిని విడిచినచో పలువురు తాము దుష్కార్యములలో ప్రవేశింపకపోయినను సత్కార్యములలో నడుగిడక, బుద్ధిపూర్వకముగా వెనుకకుఁగాని ముందుకుఁగాని సాగక జనాభిప్రాయ మనుగాలివీచువంక కెల్లను దిరుగుచు, సత్కార్యాదరముగాని కార్యోత్సాహముగాని లేనివారయి లోకమునకు నిష్ప్రయోజకు లగుదురు, మఱి కొందఱంతకంటె నధిక బుద్ధిమంతులయి తామేకార్యమును జేయకపోయినను, సంస్కారక్రియులైనట్టు నటించి చేయువారి నాక్షేపించుచు చేసినపనులలో వంకలుపెట్టుచు తమ మనస్సులకు తృప్తిగా పరిహసించి సంతోషించుచుందురు ఇట్టివారూరక కార్యనిరతుల నెగతాళిచేయుటకంటె వారు తప్పుదారిని ఒట్టినచోఁ దాము మంచిదారిని బట్టి చూపినను, చూపలేనిచో పరిహాసమును గట్టిపెట్టి మౌనమును వహించినను

ఎంతో సముచితముగా నుండును ఇతర విషయములలో కార్యశూరులు విశేషముగా లేకపోయినను, రాజ్యాంగ విషయములలో ననేకులుండి పనిచేయుచున్నారేయని కొందఱనవచ్చును కష్టములేని కార్యములలోఁ బనిచేయుట యంత గొప్పకాదు రాజ్యాంగవిషయమునఁ జేయుపని కడ్డమువచ్చువారెవ్వరు నుండరు, అట్టిపనికిఁ బూనిన వారి నందఱును శ్లాఘింతురు ఇతరవిషయములలో కృషిచేయక యొక్క రాజ్యాంగ విషయమునమాత్రము కృషిచేయుట నిజమయిన దేశాభిమానమునుగాదు మూఢులుగా నున్నవారికి రాజ్యాంగ స్వాతంత్ర్యముల నిచ్చుటవలనఁ బ్రయోజనములేదు, ఇచ్చినను వారు వానివలని లాభములను బూర్ణముగా ననుభవింపఁ జాలరు జనులయొక్క తెలివిని నీతిని ననుసరించి ప్రభుత్వపద్ధతి భేదించి యుండవలెను ప్రజలకు మంచి ప్రభుత్వమును సంపూర్ణ స్వాతంత్ర్యములను గలిగింపవలెనన్నచో, చదువుకొన్న కొందఱి స్థితిని మాత్రముగాక జనసామాన్యముయొక్క స్థితిని జ్ఞానమునందును నీతియందును వృద్ధి పొందింపవలెను అట్లు చేయుటయే దేశాభిమానము ఇతరవిషయములలో ప్రజాభివృద్ధికయి ప్రయత్నింపక రాజ్యాంగవిషయములలోమాత్రము కృషిచేయుచుండుటచే స్వప్రయోజనపరత్వముచేతనే యట్లు చేయుచున్నారని యనేకులు మనలోని చదువుకొన్న వారిపై నిందమోపుచున్నారు తమ కడుపునఁబుట్టిన బిడ్డలకు యుక్తవయస్సు వచ్చిన తరువాత భర్తలను భార్యలను వరించుకొను స్వాతంత్ర్యము నియ్యక వారిపై నిరంకుశాధికారమును చెల్లింపఁ జూచువారు, రాజ్యాంగ విషయమున మాకు సర్వస్వాతంత్ర్యముల నిం డని విదేశీయులైన ప్రభువుల నడిగిన నెవ్వరు మెత్తురు? తమ కుటుంబములోని స్త్రీలకు వారి స్వాతంత్ర్యములను విద్యను నొసఁగ వెనుకదీయువారు, మాకు జనప్రతినిధిపాలనము పెట్టి మమ్ముఁ బ్రతినిధులనుగాఁ జెట్టుఁడన్న నెవ్వరు శ్లాఘింతురు? అన్యోన్యసోదర భావములేక మానవకోటిలో కొందఱు కొందఱిని పశువులకంటెను హీనముగాఁ జూచి యవమానించుచున్నప్పుడు పయి తరగతులవారికి కొందఱికి కొన్ని స్వాతంత్ర్యములు వచ్చినంతమాత్రముచేత జనసామాన్యమునకు క్షేమసౌఖ్యము లెట్లు కలుగును? బురదలో పొరలివచ్చిన దున్నపోతు రాచుకొనిపోయినను మైలపడితిమని భావించుకొక తోడిమానవుఁడైన మాలవాఁడు వీధిలో దూరముగాఁ బోయినను మైలపడితిమనుకొనువారును, పుల్లెలుమేసివచ్చిన యావు విస్తరిలో మూతిపెట్టినను విడిచిపెట్టక శూద్రుఁడు కంటఁబడినమాత్రమున నన్నమును విడిచి లేచిపోవువారును, తాము స్వాతంత్ర్యములను పొందినప్పుడు హీనజాతులయెడ సౌభ్రాత్రము నెట్లు చూపఁగలుగుదురు? కాఁబట్టి స్వార్థపరులుగాక దేశక్షేమము నిమిత్తమే పాటుపడు విద్యాధౌరేయులు రాజ్యాంగ విషయములలోవలెనే తక్కిన సమస్త విషయములలోను యథాశక్తిని ప్రజల

దుయభివృద్ధికయి పనిచేయవలెను ఇట్లు కార్యశూరులగుటకయి దేశాభిమానమాననీయులగు విద్యాధౌరేయులు తమ క్షేమమునకంటె దేశక్షేమము నెక్కువగాఁ జూచుకొనుచు కావలసివచ్చినయెడల దేశాభివృద్ధి నిమిత్తమయి తమ దేహములను శక్తులను సంపదలను ప్రాణములను ధారపోయవలెను నిజమైన దేశాభివృద్ధి కలిగెడుపక్షమున నెప్పుడయిన స్వార్థపరులుగాని యిట్టి పుణ్యపురుషులవలననే కలుగునుగాని స్వప్రయోజనపరులవలనను ధనార్జనపరాయణులవలనను గలుగదు కాఁబట్టి విద్యాధికులు కార్యశూరులుకారని తమపైనిబడిన నిందను పరుషవాక్యములచేతఁగాక కార్యములచేతఁ దొలఁగించుకొని దేశాభివృద్ధికరములైన కార్యములలో క్రియావంతులగుదురుగాక!

మనలోని విద్యావంతులలోఁ గల లోపములని నాకుతోఁచిన వానిని గొన్నిటిని జెప్పితిని. ఇఁక వారు చేయవలసిన యర్హకృత్యములనుగూర్చి ముచ్చటింప వలసియున్నది దేశక్షేమమునకయి విద్యాధికులు చేయవలసినకార్యములు మితిమీఱి యున్నందున వానినన్నిటిని వివరించుట శక్యముకాదు వానిలోఁ గొన్నిటినిమాత్ర మిందు పేర్కొని మిగిలినవానిని విడిచి పెట్టెదను

౧ వ్యవసాయవిషయము — మనదేశములోని జనులలో విశేషభాగము వ్యవసాయమువలననే జీవనము చేయుచున్నారుగదా? అట్టివారు విద్యాగంధములేనివారగుటచేత కృషిశాస్త్రజ్ఞానము లేనివారయి భూమివలన తగినంత ఫలమును బొందఁజాలకున్నారు వ్యవసాయము చేయుట తమగౌరవమునకు లోపమన్న పిచ్చియభిప్రాయమును విడిచి విద్యాధికులయిన వారిలోఁ గొందఱు తాము కృషిశాస్త్రము నభ్యసించి స్వయముగా కృషిచేయుట కారంభించి తాములాభమును బొంది తమ నిదర్శనమువలన కాపులు లాభమునొందునట్లు చేయవలెను

౨ శిల్పాదికర్మలు — కేవల వ్యవసాయమువలన దేశమెన్నఁడును భాగ్యసంపన్నము కాఁజాలదు దేశము భాగ్యసంపన్నము కావలెనన్నచో శిల్పాదికర్మలు వృద్ధిపొందవలెను మూఢులచేతులలోనున్న యేపనియు వృద్ధినొందనేరదు శిల్పాదుల వృద్ధికయి యాయాపనులలో విద్యాధికులు ప్రవేశింపవలెను దేశమంతకంతకు దారిద్ర్యదశకు వచ్చుచున్నదని వృత్తాంతపత్రికలలో వ్రాయుటతోను, రాజకీయోద్యోగములలోఁ బ్రవేశించి పొట్టపోసికొనుటతోను, తృప్తినొంది యూరకుండక విద్యాధికులలో తగినంతమంది యమెరికా ఖండమునకును యూరపుఖండమునకును బోయి యక్కడికర్మశాలలలో యంత్రనిర్మాణాదులను నేర్చుకొనివచ్చి, యంత్రములను స్థాపించి కాగితములు, పంచదార, లోహములు, అద్దములు, వస్త్రములు, బొచ్చుబట్టలు, సబ్బు,

నిప్పుపుల్లలు, మొదలైనవి యీదేశమునందే చేయునట్లుచేసి దేశాభిమానమును జూపవలెను

3 ఆరోగ్యధర్మములు —పల్లెలయందుమాత్రమేకాక పట్టణములయందునుబహుజనులారోగ్యధర్మముల నెఱుఁగనివారయి యనేకవ్యాధుల పాలగుచున్నారనుట యెల్లరు నెఱిఁగిన విషయమేకదా? విద్యాధికులు కొందఱు దేశభాషలలో సులభశైలితో నారోగ్యధర్మములను బోధించు పుస్తకములను రచించియు, ఇరుగుపొరుగులవారి కారోగ్యధర్మములయావశ్యకమును దెలిపియు, తాముపోయిన స్థలములలోనెల్ల నావిషయమున నుపన్యాసములుచేసియు, లోకోపకారము చేయవచ్చును

౪ నీతివృద్ధి.— జనులెంత తెలివిగలవారయినను నీతిమంతులయినంగాని దేశము మంచిస్థితికిరాదు మనదేశమునందిప్పుడు నీతికంటె జాతికట్టుపాటు లెక్కువవిగా భావింపఁబడుచున్నవి ఒకబ్రాహ్మణుఁడు నరహత్యచేసినను జాతిభ్రష్టుఁడుగాక పరిశుద్ధుఁడయిన శూద్రునియింట భోజనముచేసిన మాత్రమున వర్ణబాహ్యుఁడగుచున్నాఁడు ఈ జాతికట్టుపాటు లైకమత్యాభావమునకును, నీతిరాహిత్యమునకును, కృషివాణిజ్యాది కర్మలహైన్యమునకును, కారణములగుచున్నవి బొంబయి రాజధానిలోని యొక్క బ్రాహ్మణవర్ణములోనే ౧౨౨౬ శాఖాభేదము లున్నవఁట నష్టకరమైనట్టియు ననావశ్యకము లయినట్టియు నిట్టిభేదములను రూపుమాపుటకయి చదువుకొన్నవారు కృషిచేయవచ్చును, రాజకీయోద్యోగులలోఁ గలలంచములను తగ్గించుటకయి పనిచేయవచ్చును, మనలోఁ గలమోటుహాస్యములనుమాన్పుటకయి యత్నింపవచ్చును మనలోనిపట్టపరీక్షయందు కృతార్థులయినవారు సహితము కొందఱు మోటుహాస్యములను విరసములైనమాటలను బలుకుచుండుట చింతాకరముగానున్నది హేయాతిహేయమయినవ్యభిచారమునే సులభప్రాప్తిగాఁ జేకొన్న వేశ్యలను వివాహాది శుభకార్యములయందు రప్పించి వారిచేత బూతుపాటలను పాడించెదుష్టురాచారమును పోఁగొట్టుటకయి కృషిచేయవచ్చును. పట్టపరీక్షా సిద్ధులే కొన్నిచోట్ల బోగముమేళములను ప్రోత్సాహపఱుచుచుండుట శోచనీయముగానున్నది విద్యాధికులయిన కొందఱు మహానుభావులు స్త్రీలలో తప్పయిన వ్యభిచారము పురుషులలో తప్పుకానట్లు తామే కన్నెఱికములు చేసికొనియు వేశ్యలనుంచుకొనియు తమ విద్యకును వివేకమునకును నగుబాట్లు తెచ్చుచున్నారు తోడివిద్యాధికు లట్టి సిగ్గుమాలినవారిని గౌరవింపక తమ యనిష్టమును బహిరంగముగాఁ జూపవలెను

౫ అతిబాల్య వివాహములు —అతిబాల్యవివాహములవలన స్త్రీపురుషులకు విద్యాభంగము కలుగుటయు దుర్బలులయి రోగిష్ఠులయినబిడ్డలు పుట్టుటయు మొద

లయిన యనేకానర్థములు కలుగుచున్నవనుట యెవ్వరు నెఱుఁగని విషయముకాదు అనర్థదాయకమయిన యీదురాచారమును మాన్పుటకేగాక వివాహమునందలి దుర్వ్యయములను మాన్పుటకొఱకును ప్రతివిద్యాధికుఁడును కృషిచేయవలెను

౬ వితంతు వివాహములు —మన దేశములో వితంతువివాహములను మాన్పుటవలనఁ గలుగుచున్న గూఢవ్యభిచారము శిశుహత్యలు మొదలైన పాపములమాట యటుండనిచ్చి నోరెఱుఁగని పసితనములో నెవ్వనికోయిచ్చి పెండ్లిచేసి యాబాలభర్త యుక్తవయస్సు రాకమునుపే చచ్చినను నిర్దోషురాలయిన యా బాలికను మరల వివాహము చేసికొనకుండ నిర్బంధించి యావజ్జీవమును బెట్టెడు కడగండ్లను దలఁచుకొన్న పగవానిమనస్సయినను కలుక్కుమనకమానదు భరతఖండమున కంతకు నవమానకరమయిన యీక్రూరదురాచారమును మాన్పుటకయి కృషిచేయుట కరుణాలేశముగల వానికెల్లను కర్తవ్యము

౭ అపాత్రదానము —అంధులు మొదలైనవికలాంగులకును, దరిద్రులయిన రోగపీడితులకును, దిక్కుమాలిన వృద్ధులకును, దానముచేయుట యెల్లవారికిని కర్తవ్యముకాయపుష్టిగలిగి పాటుపడ శక్తిగలవారికి దానముచేసి సోమరితనమునకు ప్రోత్సాహము కలిగించుట పాపహేతువు మన దేశములో సాధారణముగా దానములిట్టియపాత్రులకే చేయఁబడుచున్నవి గతజనపరిగణనమునుబట్టి యొక్క మనచెన్నపురి రాజధానియందే భిక్షాటనముచే జీవనముచేయువారు రెండులక్షల యేఁబదివేలున్నారు పాటుపడి కుటుంబములను పోషింపఁగల యవయవపటుత్వముగలయింతమంది పాటుపడక సోమరి జీవనము చేయుచున్నప్పుడు దేశము బీదస్థితికిరాక యెట్లుండును?

౮ స్త్రీవిద్యా స్వాతంత్ర్యములు —కుటుంబసౌఖ్యమునకును దేశాభివృద్ధికిని స్త్రీవిద్య యత్యంతావశ్యకమయినను, చదువుకొని స్త్రీ లుద్యోగములు చేసెదరాయనియు చదువుకొన్న స్త్రీలు గృహకృత్యముల ననాదరము చేయుదురనియు విటుల కుత్తరములు వ్రాయుదురనియు వాదించు మహానుభావు లింకను విద్యాధికులలోనే కొందఱున్నందున విద్యావంతు లట్టి దురభిప్రాయములను తొలఁగించి సర్వవిధముల స్త్రీవిద్య వర్ధిల్లునట్లు చేయవలెను చదువుకొన్నవారు తమ భార్యలను బానిసలవలెఁ జూడక వారితోఁగలసిమెలసి పగలుసంభాషించుచు నేకపంక్తిని భోజనముచేయుచువారిని గదులలో మూసియుంచక వారి స్వాతంత్ర్యముల నిచ్చి సహధర్మచారిణులఁగాఁజూడవలెను. ఇట్లున్నచో స్త్రీలు తమకీస్వాతంత్ర్యములు కావలెనని మొఱ్ఱపెట్టుకొనుచున్నారాయని కొందఱడుగ వచ్చును స్త్రీలను తమ స్వాతంత్ర్యములను తెలిసికోలేనంత దుస్థితికిఁ దెచ్చినందునకయి మనము సిగ్గుపడవలెను విల్లియమ్ విల్బర్ఫోర్సు బానిసవ్యాపా

రమును మాన్పుటకయి ప్రయత్నించినప్పుడు బానిసలుతమ స్థితిని మాన్పుటకయి యెవ్వరితోనైనను మొఱ్ఱపెట్టుకొన్నారా? లేదు లేకపోయినను తమ స్వాతంత్ర్యముల నెఱుఁగక తమస్థితితో తృప్తినొందియున్నవారి జ్ఞానహీనతకు పరితాపపడి యతఁడాఫ్రికా ఖండములోని బానిసలస్థితిని బాగుచేయుటకయి తనధనమును శక్తిని ధారపోసినవాఁడు పరోపకారు లన్యదేశములవాంహీనస్థితిని బాగుచేయుటకయి యంత శ్రమపడినప్పుడు మన కుటుంబములలోని స్త్రీలగలని బాగుచేయుటకయి ప్రయత్నించుట విద్యాధికులకు ధర్మముకాదా?

ఇఁక మన పట్టణమునందలి విద్యాధికులకు రెండుమాటలుచెప్పి యీవిషయమును ముగించెదను మనపట్టణ మితరపట్టణములకంటె నధిక నాగరికత గలదనియు నిందుండు విద్యాధికులు దేశాభివృద్ధినిమిత్తమయి పని చేయువారనియు కొంతపేరు వచ్చినది పూర్వమొకప్పుడు సాంఘికదురాచారనివారణమునిమిత్తమయి పని చేయుచుండినవారికి వారియభిప్రాయములను వెల్లడించుటకే చోటుదొరకుట దుర్ఘటమయినందున, అట్టి కొఱఁతను నివారింపఁబూని విద్యాధికులవలన దేశమునకు క్షేమముకలుగునన్న పూర్ణవిశ్వాసముతో నేనీమందిరమును గట్టించితినిగాని చదువుకొన్నవారి బంతులాటలు మొదలయినవానికి తావులేదన్న తలఁపుతోఁగాదు దేహారోగ్యమున కత్యావశ్యకములయిన బంతులాటలు మొదలయినవాని నిక్కడ యథేచ్ఛముగా జరపుచు విద్యాధికులు నెలకొక్కసారియైన దేశాభివృద్ధి కనుకూలములయిన యుపన్యాసాదులు జరపి నాకానందము కలుగఁజేసి యీపట్టణమున కీవఱకు వచ్చినపేరు నిలిపి దేశాభిమానులన్న కీర్తినిబొందఁ బ్రయత్నింతురని వేఁడుచున్నాను కార్యభారమును సమర్థతరులయి విద్యాధికులయిన యౌవనపురుషుల కొప్పగించి నాపనినుండి విశ్రాంతిపొందఁ బోవుచున్న నాప్రార్థనను ఇచ్చుటి విద్యాధికులు మిత్రభావముతో మన్నింతురుగాక!

---

## నూతనముగాఁ బ్రకటింపఁబడిన పుస్తకములు

| | | |
|---|---|---|
| ౧. | నాచనసోముని ఉత్తరహరివంశము ... | రు ౧-౬-౦ |
| ౨ | చిత్రభారతము .. ... . . | ౧-౬-౦ |
| ౩. | ఆంధ్రకవులచరిత్రము మూడవభాగము . | ౧-౬-౦ |
| ౪ | శ్రీవిక్టోరియా మహారాజ్ఞిచరిత్రము. ... . | ౦-౬-౬ |
| ౫. | దక్షిణగోగ్రహణ నాటకము. ... .. | ౦-౬-౬. |

---

అర్ధరాత్రి ఖయిదీని దానొంటరిగ వెంటఁబెట్టుకొని పోవలదనియు, నది ప్రమాద కారణమనియు, మేము వలదని వాదించిన మామాటలు వినక యతఁడట్లు దొంగతో నెటకోయరిగెను మేమును వెనువెంట రహస్యముగ నరిగి వారి సంభాషణఁ గొంత వింటిమి మాకు వారిమాటలు స్పష్టముగా వినఁబడలేదు కాని నాలుగువందల రూపాయిలు కావలెను లేనియెడ నేనిన్ను విడువను అను మాటలు మా చెవులఁబడినవి తరువాతఁ గొంతసేపటికి దొంగ పారిపోయినాఁడని యాతఁడే మాతోఁ జెప్పెను ఇంతకుమించ మేమేమియు నెఱుఁగము శ్యామసుందరుఁ డానుడువులనాలకించి వింత కథలు సృష్టించిన బంట్రౌతుయొక్క ద్రోహసాహసముల కచ్చెరువడి ,,ఇది కేవలమబద్ధము దౌలతరావు మొదలగువారికుట్ర' అను గత్తుపలుకుల కాగ్రహించి ,,ఫీనోరు మూయుము నిన్నెవరడిగినారు' ఇతరులజోలి నీకెందుకని గోమాజీరావు వానిని మందలించి రెండవసాక్షిని విచారణసేయ వాఁడును మొదటివాఁ డప్పగించిన పాఠము నేయప్పగించి దత్తునకు మఱియు నక్కజమునుఁ గల్గించెను మూఁడవవాఁడు కొంచెము మెదకుండుగావున సాక్ష్యమిచ్చునపుడు తడఁబడి యొకమాట కొకమాటఁ జెప్పి తన సాక్ష్యమిరువురకుఁగూడ నిరర్థకముసేయుటయేగాక నడుమ నొకసారి యిట్లు నిన్నెవరు చెప్పుమన్నారని దత్తుబుకాయించి యడుగ దౌలతిరావు చెప్పుమన్నారండి అని లేదండిలేదండి నేనే చెప్పినానండియని పడఁక నారంభించెను కచ్చేరిలో వేడుకచూడ వచ్చి కూర్చున్న దౌలతరావు మొగము చిన్నపోయెను. చూడవచ్చినవారందఱు మిక్కిలి యన్యాయము అన్యాయమని యఱచి చప్పటులుఁగొట్టిరి గోమాజీరావు మిగులఁ గోపముతో ఛీ మూర్ఖుఁడా నీదొంగసాక్ష్యము నేను నమ్మను నీతోడి వారిద్దఱు నిజముఁబలుక నీవు దత్తువద్ద లంచము పుచ్చుకొని యబద్ధమాడెదవా మాఁడు నిన్నేమి చేసెదనో చూతుమని యాపెంకరి బంట్రౌతునకుఁ జాలినంత పిటికెమందుఁ బెట్టెను దానితో వాఁడు దిరుగ తెలివిఁ దెచ్చుకొని చెప్పవలసినట్లు చెప్పెను ఇంతలోఁ బల్లకిలోఁ గూరుచుండి ఋషి యరుదెంచుటయు సభ్యులును కొత్వాలునుఁగూడ నాతని సన్మానముచేయుటకు లేచినిలిచి నమస్కారముఁ జేసిరి ఋషి నారాయణ, నారాయణ యనుచు నందఱుఁగూర్చుండ నియమించి యున్నతాసనమునఁ గొత్వాలునకు సరాసరిగఁ దాను సుఖాసీనుఁడయ్యెను అనంతరము వినయవిధేయతా పూర్వకముగ ఋషినిఁ గన్గొని కొత్వాలు దమకీవిషయమునఁ దెలిసినంతఁ జెప్పవలయునని నాప్రార్థనయన ఋషి యిట్లనియెను నన్ను మీరు ప్రశ్నవేయవలదు భగవంతునిమోముఁ జూచి నిష్పక్షపాతముగ నేనుఁ జెప్పెదను శ్యామసుందర దత్తు నాకుటీరమున కప్పుడప్పుడు వచ్చుటగలదు నాతో రహస్యమున కొన్ని యోచనలుసేయఁ బ్రయత్నించెను దొంగ

పొంచిపోవుటలో దత్తు పొరబాటుపడెనో బుద్ధిపూర్వకముగఁ జేసెనో చెప్పఁజాలను రాజభక్తి యతనికి విస్తారముగ నున్నదని నమ్మఁజాలను పొరబాటుచేతనో బుద్ధిపూర్వకముగనో రాజద్రోహము జరిగినట్లగునుక శిక్షకుఁడగనవాఁడేయని నాకుఁదోచుచున్నది ఇతఁడు నసత్పురుషుఁడని నాయభిప్రాయము అని ఋషిపలుక "ఛీ! ఈ ఋషిగూడ నబద్ధమాడుచున్నాఁడు ఏమిది యని దత్తుబిగ్గఱగ నఱచెను "అయ్యయ్యో! దైవస్వరూపుఁడగు ఋషి యబద్ధమాడుచున్నాఁడని యనుటకు నీనాల్క యెట్లాడెను? మూర్ఖుఁడా నోరు మూసికొనుము' అని గోమాజీరావు దత్తునుగదిమి యాయభియోగము నిట్లు సమాప్తముచేసెను "ఓయీ శ్యామసుందరదత్తా నీయందమును నీవయసునుఁజూడ నాకు మనసు కరఁగుచున్నది కాని నీచేష్టలు నీస్థితికిని వయస్సునకునుఁ దగినవికావు చిన్నతనమునందే యింతటికుట్రలు చేసినవాఁడవు నీవు పెద్దవాఁడవగుదువేని లోకములు ముంచివేసెదవు అంతటి ధర్మస్వరూపుఁగాని మోసముచేయుటకు నీమనసెట్లు లొప్పినది! ఋషిమాటలఁ బట్టిచూచిన సేవకులసాక్ష్యముఁ బట్టిచూచిన నీవు అపరాధివని నాకుఁ దోచుచున్నది నీకిప్పుడు శిక్షవిధింపవలయును' అను నప్పటికి దత్తువానిమాటల కడ్డమువచ్చి "అయ్యా! మీరు నాకువిధించెడు శిక్ష మరణముకంటె నెక్కువుగ నుండదు నేనందుకు సిద్ధముగనుంటినిగనుక నేనెఱిఁగిన నిజమందఱముందుఁ జెప్పుచున్నాను! దొంగయు మనుష్యునివంటివాఁడే నీవును జస్వంతరావుతోడను దౌలతరావుతోడనుఁ జేరి పెక్కుకుట్రలుసేయుచు నేమియు నెఱుఁగనివానివలె వేదాంతములు పలుకుచున్నావు నీకుట్రలు నేనెఱుఁగుదును నన్నుఁ గోరినను రాజద్రోహము నాదగ్గఱలేదు నేను ఘనమైనచావు చచ్చుచున్నాను నీవు నీచమయిన బ్రతుకు బ్రతుకుచున్నావు ఎప్పటికైనను నీసంగతి వెలుతురులోకి రాక మానదు డంబము చిరకాలముదాగదు' అని దత్తు జనులు విస్మయమును జాలియునొందునట్లును గోమాజీరావు నిశ్చేష్టుఁడగునట్లును నిష్ఠురముగఁ బలుకుటయు సభయెల్ల నిశ్శబ్దమయ్యెను ఋషివచనంబుల నమ్మి కొందఱు శ్యామసుందరుఁడు దోషియని వాదింప వానిమాటలు విని కొందఱు దత్తు నిర్దోషియనియు మరణమున కనర్హుఁడనియు నెంచి కొత్వాలుతీర్పు నియ్యకముందే దత్తాతని క్రూరవచనములచే నొప్పించుటచే నతఁడేమి విపరీతపుతీర్పు నిచ్చునోయని యోచింపఁ దొడఁగిరి అంతలో నొకసేవకుఁడు త్వరితముగవచ్చి కచ్చేరిలోనున్న జనుల నొత్తిగించుకొని కొత్వాలు సమీపమునకుఁ బోయి నిలిచి వానిచేతికొక యుత్తరమునిచ్చెను ఆయుత్తరమును మెల్లగాఁ జదువుకొని గోమాజీరావు చిఱునగవుతో సభ్యులనుఁజూచి "చూచినారా వింత! శ్యామసుందరదత్తుపైఁగల ప్రేమచే రాధాకాంతరావు నాకువ్రాసిన యుత్తరమెట్లున్నదో చూడుఁడు"

అని ,,నీవును నేనును స్నేహితులమగుట నేఁడు సార్థకము కావలయును కావలసిన వాఁడవు, గొప్ప యుద్యోగమున నున్నందులకు నాకీ మేలుచేయుము శ్యామసుంద రుని నేను వృద్ధిలోనికిఁ దెచ్చుచున్నాను వాఁడు నాకుఁ బుత్రప్రాయుఁడు వాని మీఁద వచ్చిన యీ నేరమును నీవు తప్పించి శిక్షలేకుండ వాఁడు తప్పించుకొనునట్లుచేసి ప్రాణములు కాపాడుము నీమేలు మఱువను నన్ను రాణీగారు దూరదేశము పంపినారు గనుక ప్రయాణములో నుండుటచే నేను నీతో స్వయముగ మాటలాడఁ జాలనైతిని నీకుఁగావలసినచోఁ గొంతలంచముఁగూడ నేను జాగ్రతఁ బెట్టఁగలను ఎట్లైనఁ గట్టువాని పడుపుము రాధాకాంతరావు అను నొక యుత్తరమునుఁ జదివి వినిపింప సభ్యులు రాధాకాంతుని తెలివితక్కువను న్యాయవిరుద్ధబుద్ధిని వేనోళ్ల నిందించిరి అట్టి నీతి బాహ్యమగు ననాలోచనపూర్వక కార్యము రాధాకాంతుని వంటిలోకజ్ఞుఁడుచేయుట యనుచితమనియు నంపుచ శత్రువుని పేర నట్టి రహస్యములగు జాబులు వ్రాయుట బుద్ధి హీనతయనియు, రాధాకాంతునికీర్తికి భంగము కలిగెననియు, దత్తుకిచాలింపఁ దొడఁ గెను ఉత్తరమునుఁ జదివి గోమాజీరావు బిటలుకతోఁ బండ్లుగీటుచు గ్రుడ్లెఱ్ఱఁజేసి నాయలంచము నిచ్చి ... రావు ప్రముఖులు ... చూచినారా బుద్ధి పోయినను నేను లంచము తీసికొందునా! నన్నింత యవమానము నతఁడు చేసినందుకు నేను రాణితోఁజెప్పి దీనికిఁ దగినంతచర్య జరుపకమానను అనుచితమయిన యీ యుత్తరమును వ్రాసి రాధాకాంతుఁడు తన నీచబుద్ధినిఁ గనఁబఱచుకొన్నాఁడేకాని నేను రాణివిషయమై యన్యాయము చేయుదునా! మక్కడు సూటిగఁబోయెదను నాసంగతి నెవ్వరెఱుంగరు అని పలికి తత్క్షణమే తీర్పుచెప్ప నుద్యుక్తుఁడయ్యెను చూడ వచ్చినవారందఱు చెవులు దోరఁబెట్టుకొని తీర్పువిన సిద్ధముగనుండఁగ శ్యామసుందరుఁడు నిశ్చలహృదయముతోఁ దన గతినిఁ జెవులారవినుటకు వేగిరపడుచుండెను అప్పుడు కొత్వాలిట్లు తీర్పు వినిపించెను ,,ఓయీ శ్యామసుందరా! నీవుచేసిన రాజద్రోహము నకు నీకు నేను మరణదండన విధించినాఁడను రేపుసాయంకాలము నీకు శిక్షయగును" అని బంట్రౌతులనఁజూచి వీనినిఁ జెఱసాలకుఁ గొనిపొండని యానతిచ్చి వెంటనే సభాస్థానమును విడిచి యాతఁడు రాణిచేఁ దన తీర్పునామోదింపఁబడఁ జేసికొనుటకు రాణి యంతిపురికేఁజనెను తీర్పువిని జనులు రామరామ! హరిహరీ! 'ఎంతకష్టమెంతకష్టము! అయ్యో! అనుచు విలపించి యొక్కరొక్కరుగ గోమాజీని నిందించుచు నిండ్లకుఁ జనిరి అవసరమునుకు మనోవ్యథను దొలఁగించి కమలను సందర్శించు సుఖమును త్వరలిముగఁ జేయఁ జేసెవములకుఁ గొత్వాలునకు మ్రొక్కుచు శ్యామసుందరుఁడు మొక్కవోని మనోధైర్యముతోడను గుబులపాటులేని చూపులతోడను రాజభటులచేఁ జెఱ

పాలకుఁ గొనిపోఁబడుచుండెను అంతలో మహాపురినుండి దత్తుయొక్క సోదరి యగు నానందబాయియు నామెమగఁడు మురళీధరదాసును వచ్చి దత్తుయొక్క దురవస్థ విని విలపించుచునుండ, నందు నానంద, కడసారి తనముద్దుల తమ్మునిఁజూడఁగోరుటచే మురళీధరుఁడు త్రోవలో దత్తున కెదురుపడి యాలనిఁజూచి మనస్సుచెడి యేడ్చి వాని సోదరి కొకసారి వానిఁ జూపుమని బంట్రౌతును వేడుకొనెను. తన సోదరి నట్టి సమయమునఁ జూచుట కిష్టములేక దత్తువలదని రాజభటులతో వాదించినను, దయాళు రగువారు వాని మాటఁద్రోచి తన్నగా వాని నానందకడకుఁ గొనిపోయిరి లావణ్య వర్షముగురియు తమ్ముని మొగము విన్నఁబోవుటయు దీర్ఘబాహులు వెనుకకు విఱుగఁ గట్టఁబడుటయుఁ జక్కని తలవెండ్రుకలు చీకాకుపడుటయు విచ్చుకతులతో రాజభటులు వాని వెంబడించుటయుఁ గనుంగొని యానంద డెందంబువగుల దుఃఖముపట్టలేక యో తమ్ముఁడాయని కేకవేసి మూర్ఛిల్లెను సమానదుఃఖితుఁడైన మురళీధరునిచేఁ జేయఁబడిన శైత్యోపచారములచే నామె తెలివినొంది హా తమ్ముఁడా! యెంత కష్టమురా! నాయనా! నేనెట్లు బ్రతుకుదునురా! తండ్రీ! నీకుఁ బెండ్లివారు వచ్చినారు వారితో నేమని చెప్పనురా నాయనా! నాపరాలచెట్ల నిన్నుఁ జూచుకొని నాముద్దుముచ్చటలు చెల్లునని మురియుచున్నానురా తండ్రీ! యీపాపిష్ఠి యుద్యోగము నీచావునకే వచ్చినదటరా! యింతమందియుండ దేవునికంటికి నీవే కనఁబడితివటరా! అని పరిపరి విధముల గుండెబాదుకొని తలగోడకువేసి కొట్టుకొని యెక్కుడైన ముషియెత్తుకొని బ్రతుకకుండ నీకీకర్మమెందుకువచ్చెనోయి! మీబావను వేళాకోళముఁజేసెడు వారెవ్వరు బాబు నాతో మాటలాడవేమిరా నామీద కోపమాయని గడ్డముపట్టుకొని బ్రతిమాలుచు ముద్దుఁబెట్టుకొనుచు నేడ్వసాగెను ,,అక్కయ్యా నాఋణము దీఱిపోయినది. దుఃఖించిన కార్యములేదు నేను నీవాఁడనుకాను బావా ఆమెనూరడింపు నాకు సెలవిమ్ము పోయెద"నని పలికి దుఃఖమాగక తానుగూడ సోదరియొడిలోఁ బండుకొని దత్తు పెద్దపెట్టున నొకమాఱు రోదనము సల్పెను ఆదుఃఖముఁ జూడలేక బంట్రౌతులుగూడ నేడ్చిరి తుదకు రాజభటులు దత్తునుఁదీసికొని పోవుటకుఁ బ్రయత్నము చేయ, నానంద దుఃఖావేశముచే నొడలెఱుంగక ,,ఓరీ దుర్మార్గులారా! నాతమ్మునిఁ దీసికొనిపోవుటకు మీరెవ్వరురా? మిమ్మునుఁ జంపి వేసెదను మాయింటినుండి పొండో'యని విఱిచికట్టఁబడిన దత్తుయొక్క చేతులను విప్పసాగెను మురళీధరదాసును రాజభటులును వారించి యామె నొక మూలగదిలోనికి సాయముఁబట్టి యీడ్చుకొని తీసికొనిపోయి యందుఁ బడవేసిరి. తరువాత నానంద మూర్ఛిల్లినందున నదియె దాటిపోవుటకుఁ దగుసమయమని దత్తు బావా నామీద దయయుంచి నేనిదివఱకుఁజేసిన తప్పులు క్షమియింపుము నా

యాస్తి నా మేనల్లునికి వ్రాసి నన్ను జ్ఞాపకముంచుకొనుము మాయక్కను దయగాఁ జూచుచుండుము అని బంట్రౌతులతో గుమ్మము దాటివెడలెను మురళీధరుఁడు వెనువెంటను జని, నాయనా నిన్ను క్షమియింపుటకు నీ స్వల్ప జీవితకాలమున నీదగ్గఱఁగల్గిన తప్పులేవి? నాకుడిభుజము పడిపోవుచున్నది మేరుపర్వతమువలె నీవున్నావుగదా యని నిన్ను నేను నమ్ముకొన్నాను నీవు నన్నే కాకినిఁ జేసి నీత్రోవను బోవుచున్నావుగదా? నాయనా నీయందము నేలపాలు గావలసినదినము వచ్చినది అని విలపించెను అంతలో భటులు వేగిరపడి గోమాజీరావునకుఁ దత్తిక్కడకువచ్చుటఁ దెలిసినఁ దమకు మాట వచ్చునని యాదత్తును జెరసాలకుఁ గొనిపోయిరి ఆదినమున నే భోజనములులేక యానందామురళీధరులు మహాపుకకంగిరి రాణి దత్తునకు గోమాజీ విధించిన శిక్ష నంగీకరించెను

---

## పదునాలుగవ ప్రకరణము

---

ఓసీ! సీతా నీవు చెప్పెడు కథలు మిగులఁ జమత్కృతితో నిండియుండును ఇంత చిన్నతనములో నింతింతచిత్రముల నెన్నడు నేర్చుకొంటివి? ఒకపర్యాయము కడుపు చెక్కలగునట్లు నవ్వింపఁగలవు మఱియొకపర్యాయము హోరారున నేడిపింపఁగలవు హాస్యశృంగారకరుణా రసములు నీసొమ్ములేయని తోఁచుచున్నది నీవు వివాహముఁ జేసికొని నీయత్తవారింటికి కరుగదువేని నేనెట్లుండఁగలను? అని ముక్తాభాయి తన కెదురుగఁ గూర్చుండియున్న సీతాభాయినింగూర్చి పలికెను రాధాకాంతరావొప్పగించినదిమొదలు దాసియగు సీతాభాయి రాణియెడఁ దత్కుమారికయెడల నత్యంత విధేయతతో నడుచుకొనుచు సమయోచితముగ వారిచిత్తరంజనకరమగు వినోద కథలనుఁ జెప్పుచు వారిచే శ్లాఘింపఁబడుచువచ్చెను మొదట నామె ముక్తాభాయి నిమిత్తమేర్పఱుపఁబడినను దన వాక్చమత్కారముచేతను, వాక్చమత్కారమునకంటె ముఖసౌందర్యముచేతను ముఖసౌందర్యముకంటె వినయాదికసద్గుణసంపదచేతను రాణిహృదయమునుఁగూడ నాకర్షించినందున రాణిగూడ నామె చెప్పుకథలను వినుచుఁ దన విచారములఁ బాపుకొనుచుండెను సీత దాసియనియును ముక్తయజమానురాలనియుఁ బేరేకాని వారిరువురు నన్యోన్యానురాగముగలవారై నెచ్చెలులై యొకరినివిడిచి యొకరు నిమిషమైన తాళఁజాలక ప్రొద్దుపుచ్చుచుండిరి సీతకుఁ బెట్టకుండ ముక్త యేపదార్థమును భక్షింపదు రాత్రులు దనతల్లి మాడకుండ ముక్త సీతనుఁ దనమంచముపైఁ బండుకొనఁ బెట్టుకొనుటయు యౌవనాతిశయమువల్ల నుదయించుకోర్కెల నామెకుఁ దెల్పు

టయుఁ గూడఁగలదు దాసి నంతదయతోడను సమాన గౌరవముతోడను నాదరించిన స్వపరగౌరవ తారతమ్యమెఱిఁగిన తల్లియేమనునో యను భయమున ముక్తతల్లి యెదుట నితరులయెదుట సీతను దాసిగాఁజూచి యాంతర్యమునఁ జెలివలెఁ జూడసాగెను అహల్యయు సీతను సామాన్యముగ దాసియెడఁ జూపు గౌరవముకంటె నెక్కువ గౌరవమునుఁ జూపుచుఁ బ్రేమయునూల్కొల్పుచు నామెకుఁ గొఱఁతరానీక బహువిధముల నరయుచుఁ జిన్నచిన్న యంశములలో నామెయోచనముఁగూడఁ గైకొనుచు నామె బుద్ధి మెచ్చుకొనుచుండెను ముక్తాబాయి పైనుదాహరింపఁబడిన పలుకులఁబలుకుటయు సీత నవ్వుచు దీనికంతకు మీదయయే కారణము నేను మిమ్ము విడుతునని భయపడకుఁడు బ్రహ్మచర్యముతోనే కాలముఁ గడతేర్పవలెనని యూహించుచుంటినిగాని వివాహ ప్రయత్నమింతట తలఁపులేదు తమరు వివాహానంతరము నన్ను విడుతురేమో యని భయపడుచున్నాను సుడీ యని పలికెను ఆపలుకులువిన ముక్తకు శరీరమంతటగగు ర్పాటుదయించెను తలవంచుకొని, సీతనుఁజూచి ,,నీకు బొత్తుగా భయములేదు అప్పు డప్పుడిట్టిమాటలు నాకు జ్ఞాపకముచేసి నాకుఁగిలకిలపాటుఁ గలుగఁజేయుచుండు దువు [illegible] పును నెనుఁ గలిసి కొను భాగ్యమే నాకుఁగల్గునెని మాయమ్మకు వానికి నిట్టికలఁతలు గలుగవు దైవమా మాకు సంయోగముఁ గలుగఁజేయవుగదా? యని చింతిలుచు సీతతో నీక్రింది సంభాషణ ము జరిపెను

సీత —అమ్మా గంగాధర జస్వంతరావువారు మీకుఁ దప్పక లభింపఁగలరు చింత వలదు

ముక్త —కోరికలతో నాకుఁ బనిలేదు అది వ్యర్థమనోరథమని నే నెఱుఁగుదును విరోధముచే మాయమ్మ నన్ను మఱియొకరిని వరియింపుమని నాకాజ్ఞాపించును ఇష్ట ముగలవానిని విడిచి వేఱొకరినిం జేకొనుటకంటె మరణముమేలు

సీత —నిజమే అందుచేతనే కమలాబాయి, పాపము దౌలతరావును వరించుట కంటె మరణముచితమని యట్లుచేసినది మీయమ్మగారిపాలనములో నిదియొక్కటియే ఘోరమయిన కార్యము జరిగినది

ముక్త —అవును ఆమె కడునందకత్తెయట! నిష్కారణముగఁ జచ్చినది సరే చచ్చిన వారిజోలి మనకెందుకు? నాకాసంగతులు చెప్పకుము రాత్రి పీడకలలువచ్చును నీవేదైన నొక వినోదకథఁ జెప్పుము నీవు కథలనుజెప్ప నాకారోగ్యము గలుగఁజేసి నందుకు ముందుముందు నీకు నేనొకయుపకారముఁ జేసెదను ఇది నావాగ్దానముగ నీవు గ్రహింపుము నీయందు నాకట్టి దయగలదు.

సీత —(సంతోషముతో) అమ్మా యిది నాకొక్కవరము సమయమైనప్పుడు తప్పక యియ్యవలయును సుండీ ఈవేళ మీకు వింతయైనకథ చెప్పెదను అమ్మగారును గూడవచ్చి యాలకింపవలసినట్టి కథ వారు వత్తురేమో మీరు గనుఁగొందురా ?

ముక్త —అమ్మగారు కథల నాలకించుటకు మన స్థిమితముఁగలవారుగ లేరు రఘునాథరావు దేశముపై వచ్చుచున్నాఁడని తెలిసి వానిమీదికి రాధాకాంతునిఁ బంపినది ఇంకను రాధాకాంతుని వద్దనుండి యుత్తరము రాలేదు అతఁడుగూడ శత్రులఁగలసినాఁడని యీవేళ గుమాను బయలుదేరినది రాజపుత్రులు నింబపురముమీదికి వచ్చుచున్నారనియు సైన్యముల సంపుమనియు శివనాయుత్తరము వ్రాసినాఁడు ఉత్తరముఁ జూడఁగనే మాయమ్మగారికి గుండెలో ఱాయిపడినది అదిగాక క్రొత్తహోల్కారొకఁడు మాఝాతి బయలుదేరినాఁడట వానికి నేడోరేపో పట్టాభిషేకమగునట ఇవి యన్నియు నీవేళయుదయమునఁ దెలిసినవి ఆమెకేమియుఁ దోఁచుటలేదు ఇంతియే గాక గండాభిల్లు అను దొంగను విడిచినందుకు నొకనికి నీదినమున నురిశిక్ష విధించినది ఆమె యాపని చేయించుచున్నది అందుచేఁ గథ వినదు

సీత —అమ్మా యాయదృష్టహీనుఁ డెవ్వఁడు? వాఁడు శిక్షింపఁబడవలసినదే

ముక్త —నీవెఱుఁగవా? రాధాకాంతు నింటనుండెడు పడుచువాఁడు శ్యామసుందర దత్తు ఆమె పలుకు నీవచనములు చెవులఁబడినతోడనే సీత భీతకురంగమువలె బెదరుఁ జూపులుగలిగి నాలుక కొయ్యఁబోయినదానివలెఁ దడఁబాటు మాటలతో హరిహరీ ఆపిల్లవాఁడే ఆపిల్లవాఁడె అని కూర్చుండలేక స్తంభమునకుఁ జేరఁబడెను ఆమెయవస్థఁగని ముక్త భయపడి, "ఏమిది? నీవు దత్తు నేమెఱుఁగుదువు? నీకింత విచారమేల అనెను

సీత -అమ్మా పాపమాదత్తును నేనును చిన్నతనమునందు మిగుల స్నేహితులము, దైవవశమున నిట విడిపోయినతరువాత నేను మీయింట దాసినైతిని అతఁడుద్యోగస్థుఁడయ్యెను చిన్నప్పటిస్నేహముచే మిగుల జాలిగలదు

ముక్త —మనమేమి చేయఁగలము? రాజద్రోహముసేసిన దురాత్ముఁడు శిక్షాపాత్రుఁడని నీవిప్పుడేకదా పలికినావు నీమాట నీవు నిలుపుకొనుము

సీత —దాసినగు నేను నామాట నిలుపుకొనఁజాలను రాజపుత్రికలగు మీరు మీమాట నిలుపుకొనుఁడు నాకుఁ గావలసిన సహాయముఁ జేసెదనని తమరిప్పుడే వాగ్దానముఁ జేసినారుకదా? ఇప్పుడామాట నిలుపుకొని మీయమ్మగారితోఁ జెప్పి నానిమిత్త మీదత్తు ప్రాణములు రక్షింపుదురా? ఆమేలు నాకుఁ జేయుఁడు.

ముక్త —ఇది యసాధ్యము రాజకార్యములలో మాయమ్మ నామాటవినదు

నే నేపనిఁ జేయఁజాలను

అని ముక్తసందేహావిముక్తయై పలుక సీతికనుదమ్ముల మంచుబిందువులచందమున బాష్పకణములు దిగఁజార దుఃఖావేశముచే ధైర్యముజార ఘోరునరోదనము సేయఁ దొడఁగెను. అందుచే ముక్త జాలిగొని యెట్లయినఁ దన యావచ్ఛక్తిని వినియోగపరచి తల్లిమనసు ద్రిప్పదునని బయలుదేరి విచారగ్రస్తయైయున్న కాంతావతల్లియగు తల్లిం గనుంగొని యొకచో మెల్లగఁ గూర్చుండి కొంత సేపటి కామెతో 'అమ్మా రాజపుత్రులు నింబపురము నాక్రమించినారా'యని పలికెను

అహా — ఆక్రమింపలేదు ఈపో యెల్లుండియో యాపని ఒరుగును

ముక్త — అమ్మా యీదినమున నాదొక మనవియున్నది నీవు శ్యామసుందరదత్తును

అహా — తెలిసినది, చాలు చాలు నీమనవి సింగట్టి పెట్టుము, ఆవిషయమై చెప్పకు

ముక్త — అమ్మా అట్లనవద్దు వానిని బ్రతికింపుమని సీత నన్ను వేడుకొన్నది నాముద్దు చెల్లింపుము

అహా — నీకు భయభక్తులులేవు రాజకార్యవిషయములలో నీకు జోక్యమెందుకు ముక్కు పచ్చలారని పసిదానవు నీవు నాకు రాజకార్యములలో నాలోచన చెప్పవచ్చితివా! ద్రోహులను నేనురిఁదీయింపక నీసిఫారసు విని రక్షించినచో రాజ్యమునకు వైపరీత్యము తప్పకవచ్చును నీవెన్నడు నికమీద నిటువంటి స్వతంత్రములుఁ గైకొని నాకు నేవిషయమున నుపదేశముఁ జేయకుము

ముక్త — అమ్మా నేనుపదేశముఁ జేయలేదు నేను ప్రార్థించుచున్నాను

అహా — ఆదాసి వేడుకొనుమనుటయు, నీవు వేడుకొనుటయు నా? ఏమీ కొంత ము దయతో నాదరించుచున్నామని యొడలు తెలియుటలేదా! దాసియగు ఏన యంతరమును రాణివగు నాయంతరము తెలుంగక సీత సిఫారసులుచేయ సాహసించినదా జాగ్రత్తయని చెప్పు ఇంక నెవరో సిఫారసు చేయుచుందురు తత్క్షణ మీ పూటనే వాని నురిఁదీయించెదను నీస్తోత్రము నీవుపోయి చదువుకొనుము నేనిట్లన్నాన విచారమొందకుము

అన ముక్తాభాయి యుడుకుఁబోతుతనమును దుఃఖమును తెంపమున సందడింప జిన్నఁబోయి తల్లివద్దనుండి గంపంత యాసతోఁ దన్ను యెదురుఁజూచు సీతతో నిరాశగొలుపు నీపలుకులఁ దెలుప, నామె విన్నఁబోయి విచారభారముచే నన్నప నీళ్లు ముట్టకరోఁజుచుండెను

SCIENCE PAPER SERIES No 6

An —వాయువు (216వ-పుట శేషము )

మన్సూన్ అను మాటకు ఋతుపవనియర్థము ఈవాయువులవలన మిక్కిలి భయంకరము లగు తుపానులు సంభవించును వానివలన ప్రపంచమునకు చాల నష్టము సంభవించుచున్నది

## Sea and Land Breezes.

సముద్రముపైనుండియు భూమిపైనుండియు వచ్చు వాయువులు స్వల్పములైన మన్సూన్ గాలులని చెప్పవచ్చును అవియును సూర్యరశ్మిచేఁ గలుగు వేడిమివలననే పుట్టుచున్నవి పగటిసమయమున భూభాగము త్వరలో ఉష్ణము చెందును దగ్గరనున్న జలభాగముపైనున్న గాలి యంతగా ఉష్ణముఁ జెందఁజాలదు అందువలన సముద్రము పైనుండి భూభాగమునకు పగటిసమయమున చల్లని మారుతము వీచుచుండును ఈ విషయము సముద్ర సమీపముననున్న జనులకందరకును గోచరమే ఇందులకు వ్యతిరేకముగ రాత్రిసమయమున సముద్రమునుండి భూమిపై వెచ్చనిగాలి వీచుచుండును ఎందువలననఁగా, పగటిసమయమందు సంపాదించఁబడినఉష్ణము, భూభాగము రాత్రి పడినతోడనే పోఁగొట్టుకొనును సముద్రజలమన్ననో వేడిని బహు ఆలస్యముగను మెల్లగను పగటిసమయమున పొందినదై రాత్రిపడిన చాలకాలమువరకు విడువకుండును గనుక జలభాగముపైనున్న గాలి వేడిగలిగినదై యుండును అప్పుడు జలభాగమునుండివచ్చుగాలి వెచ్చగాను ఆనందకరముగాను నుండును సముద్రతీరపు ప్రదేశము లందువలననే మండువేసవి సమయముననైన సమశీతోష్ణములుగ నుండును

పగటివేళ భూభాగమునందున్న గాలి ఉష్ణము గలిగి పైకి నెగయును అప్పుడు జలభాగమునందున్న చల్లనిగాలి భూమిపై వీచును దీనికే సముద్రమారుతమని పేరు (Sea-Breeze) రాత్రివేళల భూమిపైనున్న గాలి ఉష్ణము పోఁగొట్టుకొనుటచే చల్లనిదై జలభాగమునకు వీచును దినినే భూమి వాయువులని పిలుచుచున్నారు (Land-breeze)

ఈపైని ఉదాహరింపఁబడినవి గాక ఇంకను వాయుభేదము లనేకములు గలవు అవి ఆయా దేశస్థితులనుబట్టి ఏర్పడుచున్నవి సైమూమ్ (Simoom) అను గాలి వీచునపుడు ఎడారులయందుండు ఇసుక పర్వతము లె లేచి దేశమునకు జనులకు ఎక్కువ కష్టము గలుగఁజేయును టైఫూన్ (Tiphoon) టార్నడో (Tornado) అనునవియు కూడ నట్టివే

## Hurricanes.

ఉప్పెనగాలి గొప్ప సుడిగాలియని చెప్పవచ్చును భూమికి ఉత్తరగోళార్ధమందుండు గాలి కుడినుండి యెడమకును, దక్షిణగోళార్ధమందుండు గాలి యెడమనుండి కుడికిని చలించుచుండును అనఁగా గడియారమునందున్న ముల్లుగమనికకు వ్యతిరేకముగ పోవునది మొదటిది—దానిని పోలిపోవునది రెండవది ఇట్టి వ్యతిరేక చలనములు ఎదురుగవచ్చి యొకమూల కలసినచో సుడిగాలి యేర్పడుచున్నది ఎట్లన ఎదురుగవచ్చు నీటిప్రవాహములు ఒక స్థలమునఁ గలసిన నీటిసుడి ఎట్లేర్పడునో అటువలెనే వ్యతిరేకమైన వాయుచలనములు గలిసినప్పుడు సుడిగాలి యేర్పడుచున్నది ఈ గాలివలన ననేకకాపాయములు కలుగును

సాధారణముగ వాయువులవలని ఉపద్రవములు గలిగినను, అవి మిక్కిలి ఉపకారులని యొప్పుకొనకతీరదు ఎందువల్లనన, గాలివలన మనకు అప్పుడప్పుడుగలుగు ఉపద్రవములకన్న లాభములే ఎక్కువగానున్నవనుట కెంతమాత్రమును సందియములేదు

ఉత్తరమండలమందుండు శీతము వాయుచలనమూలముననేకదా తగ్గుచున్నది ఇదియునుగాక, యనేక వృక్షజాతులయొక్కయు పుష్పజాతులయొక్కయు నంకురములు గాలి వీచుటవలననేకదా ఒకస్థలమునుండి మరియొకస్థలమునకు దూరదేశమైనను గొనిపోఁబడుచున్నవి మేఘములను జలభాగములనుండి భూభాగములకుఁ ద్రోలివేసి భూములనన్నిటిని ఫలవంతములుగ చేయునట్లు వర్షము నిప్పించు మహత్తర పదార్థము వాయువుగాక మరి యేదియైయున్నది ఇదియునుగాక, గాలిచలించనిచో మృగములకును మనుష్యులకును ననేకానర్థములు సంభవించును రోను (Rhone) నది సమీపమున పర్వతలోయలలోనున్న జనులను వాయుచలనము లేకుండుటచేఁగదా, గండమాల రోగము (Gutre)ను వెట్టితనమును మొదలగునవి ఎల్లప్పుడు పీడించుచున్నవి వాయువువలనఁ గలుగు నమితలాభములనుజూచియే కాఁబోలు మన పెద్దలు దాని నొక దైవమువలెఁ బూజించెడివారు

---

## Science Paper Series No. 7.

### EARTH —భూమి

### Springs and Glaciers —ఊటలు, మంచుగడ్డలు

భూమి నారింజపండువలె గుండ్రముగానుండునన్న సంగతి చిన్ననాటనుండియు భూగోళశాస్త్రములవలన మనము నేర్చియే యున్నాము ఇందుల కనేక నిదర్శనములు గలవు గాని అందులోఁ గొన్నిటినిమాత్రమె మీక్రింద వ్రాయఁబూనియున్నాము.

సముద్ర ప్రాంతమున నివసించియుండు జనులెల్లప్పుడు ఓడలయొక్క రాకపోక
లను గనిపెట్టుచుందురు దూరమునుండి ఒకయోడ వచ్చునపుడు దాని కొయ్య
యొక్క చివర భాగముమాత్రము గోచరమగును ఆనావ యొడ్డును సమీపించు కొలఁది
క్రమక్రమమున తెరచాపలును, అడుగుభాగమును కనిపించును ఇందులకు వ్యతిరేక
ముగ ఒడ్డునుండి ఓడ పయనమై పోవునపుడు, ఓడయొక్క అడుగుభాగము ప్రథ
మమున అంతరించును క్రమముగ తెరచాపలును కొయ్య చివరభాగమునుకూడ కంటికి
మరుగైపోవును భూమి గుండ్రముగనుండనిచో నిట్టి పనులు జరుగనేరవు

సమమైన భూభాగమున నిలువఁబడియున్నపుడు మనకంటికి ఏ ప్రక్కనైన
మూఁడుమైళ్లకన్న నెక్కువదూరము కానరాదు కొంచెమెత్తైన గుట్టపై నిలిచి చూచి
నచో నంతకన్న నెక్కువదూరము కనిపించును ఇట్లే ఓడమీఁద తిరుగుచున్న
వానికంటె దానికొయ్య చివరను కూరుచుండిన వాఁడెక్కువదూరము చూడఁగలఁడు
ఇట్లు సంభవించుటకు కారణము భూమి గోళాకారముగ నుండుటయేగాని మఱి ఒకటి
కాదు


చంద్రగ్రహణములు సూర్యునికిని చంద్రునికిని మధ్య భూమి అడ్డమువచ్చుటచేఁ
గలుగుచున్నవి. అనఁగా గ్రహణమునాఁడు చంద్రబింబముపైఁ గలుగుఛాయ భూ
చ్ఛాయయే ఈఛాయ ఒకప్పుడు పెద్దదిగాను మఱియొక సమయమున చిన్నదిగాను
గూడ ఉండవచ్చును అందువలన భూమియొక్క ఆకారము గోళాకృతియని చెప్పుట
కెంతమాత్రమును సందియములేదుగదా ఇంకను ననేక నిదర్శనములు గలవు గాని
వాని నిక్కడ నుదాహరించుట కవకాశములేదు

మిక్కిలి యున్నతములగు ప్రదేశములయందుఁగూడ భూమి పలకవలె నలుచదర
మైనదిగా కనిపించును భూమియొక్క విస్తీర్ణము మిగులమగుటంజేసి మనము చూడఁగలి
గిన భాగము బహు స్వల్పమైయుండును మనముంచు గోళము అరువది యంగుళముల
నడిమి కొలతగలిగిన చిన్నగోళమనుకొనినయెడ దానియందుండు పర్వత పంక్తులు
ఇసుక రేణువులకన్న నతిసూక్ష్మముగానుండును అనఁగా అంగుళములో నూఱోవంతైన
ఎత్తుగలిగినవిగా యుండవు దీనిబట్టి మనకంటికిఁ గనిపించు భూభాగమెంతై యుండ
వచ్చునో చదువరు లూహింపవచ్చును అతి స్వల్పభాగము కనఁబడుచుండుటచేతనే
మనకు వర్తులయాకృతి రవంతమాత్రమును గోచరమగుటలేదు

భూమి స్థిరముగ నుండుటలేదు దానికద్వివిధమైన చలనములుగలవు (1) మొద
టిది—భూమి పడమరనుండి తూర్పునకు ఒక సెకండులో పందొమ్మిదిమైళ్ల దూరంబు
పోవుచున్నది సాధారణముగ గంటలోపల నమ్మదమైళ్లు పోఁగలిగినబండిసే మిక్కిలి

నడిగల పొగబండియని మనము చెప్పుకొనుచున్నాము అంతలోపలనే అరువది ఎనిమిదివేలమైళ్లదూరముపోవుబండి యుండిన మనకెంత యాశ్చర్యకరముగ నుండును? కాని మనము నివసించియుండు భూమి ఈపాటి నడితో చలించుచున్నది

(2) రెండవది—భూమి దనయక్షముపై (Axis) ఇరువదినాలుగు గంటలలోపల ఒకసారి తనచుట్టును తిరుగును బొంగరము తనయక్షముపైదానెట్లు తిరుగునో ఆప్రకారముననే ఈగోళముగూడ చలించుచున్నది




పైనివ్రాసిన చక్రమువలన భూగోళవిషయమైన యనేక సంగతులలో కొన్నిటిని మనము తెలిసికొనవచ్చును ఇందుల "ఉ ఊ" యను గీత భూమియొక్క యక్షము (Axis) "అ ఆ" యనునది భూమియొక్క మధ్యరేఖ (Equator) "ఉ" అనునది ఉత్తరధ్రువము—"ఊ" యనునది దక్షిణధ్రువము (Poles) "అ ఆ" యను రేఖ 360 సమమైన భాగములుగ భాగింపఁబడినది ఈ భాగమునకే డిగ్రీయనిపేరు పైచక్రమున భూగోళమున నర్ధభాగంబుమాత్రము గనఁబరుపఁబడినది రెండవయర్ధముగూడ దీనిని పోలియే యుండును డిగ్రీయనఁగా 69 మైళ్లపొడవని తెలిసికొనవలయును "ఉ ఊ" లను అంటునట్లు ప్రతి డిగ్రీవెంబడిని ఒకగీతగీయఁబడినచో గోళమునందంతట 360 గీతలు లేక ఉంగరములు ఉండును ఈ ఉంగరములకే మెరిడియనులనిపేరు (Meridians) "అ ఆ" యను రేఖపైనుండు డిగ్రీలను ఏ మెరిడియన్ నుండియైనను లెక్కించవచ్చును ఈస్థానము దేశమునుబట్టి మారుచుండును అనేకదేశ శాస్త్రజ్ఞులు అనేక విధముల నిర్ణయస్థానముల నేర్పరచుకొనుచున్నారు ఇంగ్లండుదేశపువారు గ్రీనిచ్చు (Greenich) అను స్థలమునకు సరియైన మెరిడియనువద్దనుండి డిగ్రీలను లెక్కపెట్టుచున్నారు ఇతర స్థలమును నిర్ణయించుటలో ఇంగ్లీషువారు ఆయాస్థలములు గ్రీనిచ్చుకు తూర్పునఁగాని పడమరఁగాని ఎన్నోకొన్ని డిగ్రీల దూరమునసుండునని చెప్పుదురు

స్థలనిర్ణయవిషయమయిన పద్ధతిని కొంచెమిక్రింద సులభమార్గమున చెప్పనై యున్నాము పైని వ్రాయఁబడిన చక్రములలో "క" యను పట్టణముయొక్క స్థలనిర్ణయముచేయఁ దలచుచు గ్రీనిచ్చు మెరిడియనుకును ఈ "క" యను పట్టణమున్న మెరిడియనుకును ఉన్న దూరము ఇన్ని డిగ్రీలని మనము తెలిసికొనవలసియుండు

గ్రీనిచ్చున కీపట్టణము తూర్పున ఉండినయెడ ఆడిగ్రీలు తూర్పు డిగ్రీలనియును, పడమర నుండినచో పడమర డిగ్రీలనియును వాడుక చేయవలసియుండ న ఈ పదములనే ఇంగ్లీషున (East longitude and west longitude) అని వాడుచున్నారు లాంజి ట్యూడ్ అను పదమునకు సాదృశ్యమని అర్థము ఈ క యను పట్టణమునకు దూరము ముప్పది డిగ్రీలు ఇది గ్రీనిచ్చునకు తూర్పున ఉన్నది గనుక ఈ లంజ ట్యూడ్ డిగ్రీలు 30 తూర్పు లాంజిట్యూడ్ డిగ్రీలని వ్రాయవలసియున్నది (East longitude) ఈరాగున నే ఒక నిర్ణయమైన మెరిడియనువద్దనుండి ఇతర మెరిడియ నుల దూరము తెలుపబడును

లాంజిట్యూడ్ తెలిసినంతమాత్రమున స్థల నిర్ణయము చేయజాలము క' యను స్థలముయొక్క దూరము 30 డిగ్రీలని చెప్పినచో, ఆ క యను స్థలము "ఉ క ఊ" యను గీతలో నెక్కడనయిన నుండవచ్చును అందుచే మనమింకొక విషయమయి నేర్చుకొనవలసియుండును ప్రతి మెరిడియనుయొక్కయు ఉత్తర దక్షిణభాగము లిందునిమిత్తమై తొంబది సమాన భాగములుగ భాగింపబడినవి ఈ భాగములకుగూడ డిగ్రీలనియే పేరు వీనిని లాంజిట్యూడ్ డిగ్రీలనుండి భేదించుటకయి, వేరొక నామముచే పిలువవలసియున్నది వీనిని ఇంగ్లీషున ల్యాటిట్యూడ్ డిగ్రీలని వాడుచున్నారు. ఈ డిగ్రీలనుండి గీయబడు అడ్డగీతలు భూగోళమునకు ఉంగరములవలెనుండి భూమధ్య రేఖకు సమాంతర రేఖలుగనుండును (Parallels of latitude) ఈ గీతలు ధ్రువము లను సమీపించిన కొలది తగ్గుచుండును ల్యాటిట్యూడ్ అనగా భూమధ్య రేఖకును ధ్రువములకును ఉండుదూరము ఆరేఖకు ఉత్తరమందైనయెడల ఉత్తర ల్యాటిట్యూడ్ అనియు, దక్షిణమందైనయెడల దక్షిణ ల్యాటిట్యూడ్ అనియు, చెప్పవలెను "క' యను స్థానముయొక్క లాంజిట్యూడ్ 30 దాని ల్యాటిట్యూడ్ 60 అయిఉన్నది ఈ రెండుగీతలును కలిసికొనుస్థలమే ఆ "క' యను పట్టణముయొక్క స్థలము గనుక ఈ స్థలముతప్పక స్వీడన్ దేశములో నుండవలసి యుండును ఇట్లే ప్రదేశ నిర్ణయము సులభముగ చేయవచ్చును

భూమి యతివేగమున సూర్యునిచుట్టును పోవుచున్నది. అట్లు పోవుమార్గము బిందువువలె వర్తులముగనుండక కొంచెము కొనలవద్ద వంగియుండును అనగా నారింజ పండుయొక్క ఆకారముగలిగిన రేఖవలెనుండక కోడిగ్రుడ్డుయొక్క ఆకృతిని బోలిన రేఖవలె నుండును ఇట్టి చలనములు గలిగిన ఈగోళము లిట ఇచ్చవచ్చినటుల అంత రాళమునకు జెదరిపోకుండుటకు కారణమేమి? మార్గమునుండి భ్రమింపక ఎల్లపు డును ఏకమార్గముననే పోవుచుండునట్టుచేయు మహాత్ముడు సూర్యుడు సూర్యగోళము

భూగోళముకంటె పెక్కురెట్లు అధిక ప్రమాణము కలిగియుండుటచే దాని యాకర్షణ శక్తి అత్యధికముగ నుండును ఇట్టి యాకర్షణ శక్తిచే భూమిని తదితర గ్రహములను ఆపి ఉంచి చలనములను స్వాధీనపరచుకొనుచుండును

సూర్యుని పరిమాణముతగ్గి భూమియొక్క చలన వేగము హెచ్చినచో మనకేమి యాపదలు సంభవింపవచ్చును? క్షణమాత్రమున మన మందిరము లంతరాళమునకు త్రోయబడుదుము భూగోళము చెదరిపోవును జంతుజాలమును వృక్షజాతులును ఘనీభవించి నశించును ఇట్లుగాక చలనమంతయు నశించి మనగోళము కదలక యొక స్థలముననే నిలువబడియుండెనేని ఉష్ణము ప్రబలిల్లును భూమిమీదనుండు పదార్థములన్నియు వేడిమిచెంది ఆవిరియగును గనుకనే ఈశ్వరుడు భూమికిట్టి చలనముల నేర్పరచినాడు చదివిన కొలదిని, ప్రపంచమునందు ఏర్పాటులేవిగాని అనావశ్యములుగాని అసంబద్ధములుగాని కనుపడవుగదా ఆహా! ఏమి ఈశ్వర మహిమ! ఇందులకు మన కాయనయెడల ఎట్లు మనకృతజ్ఞతను గనుపరుపవలెనో ఊహించుడీ

ఈప్రక్క చక్రమున మధ్యనున్నది సూర్యుడు జూన్, మార్చి, డిసెంబరు, సెప్టెంబరు అను స్థలములలోనున్నది భూమి చుట్టును వ్రాయబడినగీత భూమి చరించు మార్గము. ఈచక్రమునుబట్టి ఋతువుల విషయమయి కొంచెము నేర్చుకొనవచ్చును


భూమి సూర్యుని చుట్టి తిరుగునపుడు నిలువబడి సరిగా చలించక దానియక్షముపై కొంచెము వాలియుండును కాలభేదమును దెలిసికొనవలెనన్న నీక్రింది సంగతులు మరువకయుండవలయును

(1) భూమియొక్క అక్షము కొంచెము వాలియుండుట

(2) భూమి తనయక్షముపై నొకసారి ఇరువదినాలుగు గంటలలో తిరిగి వచ్చుట

(3) భూమి ఒక సంవత్సరములోపల సూర్యునిచుట్టు తిరిగివచ్చుట

పైనుదాహరింపబడిన సంగతులబట్టియు, చక్రాకృతినిబట్టియు, భూమియొక్క ఉత్తర దక్షిణ ధ్రువస్థానములయందు ఒక సంవత్సరములోను ఆరునెలలు పగలును ఆరునెలలు రాత్రియునుండునని తెలిసికొనవచ్చును భూమియక్షమువైవంగి సూర్యునిచుట్టు తిరుగునపుడు ఒకధ్రువము పూర్ణముగ సూర్యకాంతిని గ్రహించుటయు, రెండవధ్రువము చీకటిలోనుండుటయు సంభవించును మొదటి ఆరునెలలలో ఇట్లును, రెండవయారునెలలలో నిందులకు వ్యతిరేకముగను సంభవించును అనగా రెండవధ్రువస్థానము వెలుతురు స్వీకరించును, అందువలన మొదటి ధ్రువస్థానము చీకటిలో నుండును ఇందుచే ధ్రువస్థానముల నగా ఉత్తర దక్షిణ ధ్రువములయందు,




ఆరునెలలు పగలును ఆర్ధనెలలు రాత్రియు ఉండును ఉత్తరధ్రువమున పగలుగా నుండినయెడ దక్షిణధ్రువమున రాత్రియు, దక్షిణధ్రువమున పగలుగానున్నపుడు ఉత్తరధ్రువమున రాత్రియు నుండును పైచక్రమువలన ఇంకను గొన్ని సంగతులు నేర్చుకొన వచ్చును మార్చి సెప్టెంబరు నెలలలో భూమిసమముగ సూర్యకాంతిని స్వీకరించుచున్నది.

భూమియొక్క యర్ధభాగము వెలుతురులో నుండుటయు, మిగిలినయర్ధముచీకటిలోనుండుటయు సంభవించును అందువలన అహస్సును రాత్రియును ఈకాలములయందు సమములుగనుండును. ఇట్టి కాలస్థితిని ఇంగ్లీషుభాషలో Equinoxes (విషువత్తు) అని పిలిచెదరు ఈక్వినాక్సు అను పదమునకు సమరాత్రిందివకాలమని యర్థము జూను నెలలో భూమి సూర్యునివైపు ఎక్కువ నిలువఁబడియుండుటచే భూగోళమున నెక్కువభాగము సూర్యకాంతిని చెందును గనుకనే ఆకాలమున అహస్సువృద్ధియై రాత్రికాలము తగ్గును ఇందులకు వ్యతిరేకముగ డిసెంబరు నెలలో భూగోళము ఎక్కువ వంగియుండుటచే నెక్కువభాగము చీకటిలోనుండుటయు మిగిలినది వెలుతురులో నుండుటయు తటస్థించుచున్నది అందుచే రాత్రులు ఎక్కువగను పగలు తక్కువగను ఉండును

వేసవికాలమున సూర్యుఁడతితీక్ష్ణముగ నుండుటయు శీతకాలమున మందముగ నుండుటయు మనము చూచుచున్నాము ఇట్లుండుటకు కారణమేమి ? సూర్యుఁడొకఁడేయయినపుడు డిట్టి వ్యత్యాసములు కలుగుట యసంభావనీయముగదా ఏపదార్థముగాని విస్తరించి వాలియుండినపుడు సూర్యునినుండి దానిపై ప్రసరించు కిరణములు తగ్గుచుండును నిలువఁబడియుండినచో కిరణముల సంఖ్య యెక్కువగనుండును ఇట్టి వంపు 60 డిగ్రీలవరకు నుండినయెడ సూర్య కిరణముల బలము సగము తగ్గిపోవును ఇందువలన భూమిపై అహస్సు తగ్గియున్న కాలమున సూర్యుఁడు కదుదిగువను ఉండును భూమి మిక్కిలి వాలియుండుటచే సూర్య కిరణము లనేకములు దానియందు ప్రసరింపఁజాలవు అందువలన ఉష్ణము తగ్గును గనుక డిసెంబరు నెలలో అనఁగా శీతకాలమునందు ఉష్ణము తగ్గియుండును ఇందులకు విరుద్ధముగ భూమి సంగా నిలువఁబడి యుండినపుడు (జూను నెలలో) సూర్య కిరణములు సరళమార్గములుగను క్రమముగను అనేకములు భూమిపై ప్రసరించును ఆకారణమువలన ఉష్ణము వృద్ధిచెందియుండును

## Summary.

ఈక్రింద వివరింపఁబడు సంగతులు బోధనార్థమై సరుగ వక్కాణించుచున్నాము —

(1) మనము నివసించియుండు భూమి గోళాకారమైన వస్తువుగ నున్నది

(2) ఈ గోళమునకు రెండు చలనములు గలవు

(a) తన యక్షముపై తిరుగుట

(b) సూర్యుని చుట్టును తిరుగుట

3) ఈ భూమి అ వేగమున చలించుచున్నది

(4) ఈ వేగమువలనఁ గలుగు చలనబలమును సూర్యునియొక్క ఆకర్షణ శక్తి జయించుచున్నది

(5) ఇందుచే భూమి సూర్యునిచుట్టు తిరుగుచు రేయింబగళ్లను ఋతు భేదములను కలుగఁ జేయుచున్నది

భూమియొక్క నడిమికొలత రెండువిధములఁ జూడవచ్చును. ఉత్తర ధ్రువమునకును దక్షిణ ధ్రువమునకున్ను ఉండునది ఒకటి అది 7899 మైళ్లు భూమధ్య రేఖ వెంబడిని ఉండు అడ్డుకొలతి రెండవది అది 7925 మైళ్లు భూమికని చంద్రునకును ఉండు దూరము 238500 మైళ్లు

## Springs and Glaciers. ఊటలు, మంచుగడ్డలు

మనము నివసించియుండు గోళమునందు భూమియు నీరును సమముగ ఆవరించి యుండుటగానము భూమి ఒకపాలును నీరు మూడుపాళ్లును ఉండి ఉన్నవి ఈగోళముయొక్క విస్తీర్ణము 1970 లక్షల చదరపు మైళ్లు అందులో 520 లక్షలు భూమియు మిగిలినది నీరును అయిఉన్నది మొదట జలమునుగురించి కొంచెము ముచ్చటింతము

భూమిపై దొరకుజలము సాధారణముగ స్వచ్ఛముగ నుండనేరదు మేఘముల వలనఁ గలుగు వర్షపునీరుకూడ వాయువులోనుండి బయలు వెడలునపుడు అందలి బొగ్గుపులుసు వాయువును గ్రహించుటచే స్వచ్ఛతను పోఁగొట్టుకొనుచున్నది వర్షపునీరు భూభాగముపైపడి కొంతవరకులోపల ప్రవేశించుచున్నది అట్లు ప్రవేశించునపుడు సున్నము మొదలగు ద్రవ్యములను స్వీకరించుచున్నది ఈనీరే భూమిలో ఒక పొరనుండి ఇంకొక పొరకుఁ జొచ్చుచు చొరరాని భాగము చేరినప్పుడు నిలచిపోవును ఈప్రదేశమునకు మనము మార్గము చేసినయెడ జలమారంధ్రమువెంటనే ఊటవలె పైకి లేచును. దీనినే జలయనికూడఁ జెప్పుచున్నాము

ప్రపంచమున స్వాభావికముగ ఏర్పడియుండు ఊట లనేకములు గలవు ఈ ఊటలలో ననేకభేదములుకూడ కలవు మట్టితైలము మొదలైన కొన్ని లోహసంబంధ ద్రవములును, అధికమైన ఉష్ణము కలిగిన ద్రవములు కొన్నియును, చమురు వస్తువులు మరికొన్నియును, ప్రపంచమం దక్కడక్కడ ఇట్టి ఊటలవలననే కలుగుచున్నవి వీనిలో వేడిబుగ్గలు (Hot springs) మిక్కిలి ప్రసిద్ధములైనవి ఐస్లండు దీవిలోనున్న వేడిబుగ్గలు గంటగంటకును ఉష్ణజలమును భూభాగముపై పెక్కడుగుల ఎత్తువరకును గూడ త్రోసివేయుచుండును. ఈ ఉష్ణజలముల ఉత్పత్తినిగురించి కొంచెము చెప్పెదము.

సాధారణముగ నీరు నూరు డిగ్రీల వేడిమి గలిగినపుడు ఆవిరియగుచున్నది. గాలియొక్క చిక్కతనము ఒకవిధమున నుండినపుడిట్లు సంభవించును గాని గాలి పలు

చున గానుండు మిక్కిలి ఎత్తయినపర్వత ప్రదేశములకు నీరు గొనిపోఁబడునపు డదినూరు డిగ్రీలకన్న తక్కువగానున్న ఉష్ణమునకే ఆవిరియగును భూమిలోనికి దిగిన కొలఁది గాలియొక్క చిక్కతన మెక్కువయగును అందువలన సాధారణముగ నూరు డిగ్రీలకు ఆవిరియగు నీరు ఇంతకన్న నధికముగ ఉష్ణముండినపుడుకూడ ఆవిరి కానేరదు. గనుకనే భూమ్యంతర్భాగమున నుండిన నీరు అత్యధిక ఉష్ణమునకు లోనయ్యును ఆవిరి కానేరక ద్రవరూపముననే ఉండియుండును మనము పైనుండి రంధ్రము కల్పించి లోపలనున్న నీటిని స్వేచ్ఛపరచినచో అది త్వరలో పైకి లేచుచు, లేచినకొలఁది నావిరి యగుచు, ఆ యావిరి బలముచే భూభాగమునకు ఎక్కువ ఉన్నతముగలేచి పతనమయి ప్రవహించుచుండును ఇట్లు స్వాభావికముగ నుండునివికూడ ననేకము లక్కడక్కడ ఉండియున్నవి

కొన్నికొన్ని ప్రదేశములయందు లోహసంబంధములయిన ద్రవముల నిచ్చునట్టియు, తైలముల నిచ్చునట్టియు, బొగ్గుగాలి నిచ్చునట్టియు ఊటలు గలవు భూమిలో నుండు పొరలయొక్క సారమునుబట్టి ఇట్టి పదార్థము లేర్పడుచున్నవి

పూర్వకాలమున వనమయమయి, కాలక్రమమున అడుగంటి యుండిన భూభాగమున బొగ్గుగాలి బొగ్గు తారు మొదలగునవి కలుగుచున్నవి ద్రవపదార్థములు రాళ్లలోనుండి చొచ్చునపుడు అక్కడక్కడనుండు ఇతర పదార్థములయొక్క అణువులను గ్రహించుచు క్రమముగ చిక్కనై తగినయంతర్భాగముల చేరియుండును ఇట్టి స్థితిలోనే చమురు మొదలగు తైలములు ఏర్పడును ఆ తైలములు మనము త్రవ్విన మార్గములగుండ భూమిపైకి వచ్చుచున్నవి ఈలాగుననే మనలకు మంటితైలము (Patroleum) మొదలగునవి దొరకుచున్నవి భూమిలోనుండి బయలువెడలు బొగ్గుగాలిని అమెరికాదేశమున కాంతినిచ్చుటకు ప్రయోజనపరచుచున్నారు. (For purposes of lighting the houses)

## Glaciers.

నీరుకూడ నదులవలె ఎట్లు పారుచున్నదో ఆలాగుననే మంచుగడ్డలుకూడ ఒకదాని నొకటిగూడి చిక్కనై నదీప్రవాహంమువలె తరలిపోవుచున్నవి ఈ మంచుగడ్డలు నదులవలె నతిత్వరతోఁ బోఁజాలక పోయినను, తమపాటి వేగముతో పారుచుండును మంచుగడ్డ లిట్లు పర్వతముల మధ్యనుండి కదలివచ్చునపుడు తమ బలిమిచే పర్వతములను నున్నపరచుచు మార్గములను కల్పించికొని పెద్దపెద్ద రాళ్లనుకూడ మోసికొని పోవుచుండును శీతల ప్రదేశములందు మాత్రమేకాని ఇతరస్థలముల యందు మంచుగడ్డ ప్రవాహములు కలుగనేరవు ఈప్రవాహములు బయలువెడలి కొంచెము

ఉష్ణముగల ప్రదేశములను జేరఁగానే యవికరఁగి నిజమగు నదులగుచున్నవి ప్రస్తుత మందు అనేకనదుల కిట్టియుత్పత్తి స్థానములే కలిగిఉన్నవి

## మన్యవ్యాఘ్రము.

(192-వ పుటశేషము)

కుబే—నీకున్నదో లేదో విచారింపవలసిన యవసరము నాకులేదు కాని, నీకు బహుమానమియ్యకమాత్రము మానను మానిజయసేనుని, విమలను, ఇక్కడనున్నయెడల సుమంత్రునిఁ బిలువుము

కృష్ణ—చిత్తము (వెళ్లుచున్నాఁడు)

కుబే—లేక, ఆగు' నీవు మంచియాలోచన పరుఁడవు అందుచేత నిన్నొకటి యాచించుచున్నాను నాయవజ్ఞ వెల్లడిచేయకు చండసేనతో జరిగిన మాటలసంగతి యేమియు తలపెట్టకు శిలాకఠినమని నీవు తలఁచిన నాహృదయము దయార్ద్రకోమల మగుట నీవు చూడఁగలవు

కృష్ణ—నన్ను మీరు నమ్మవచ్చును నేను తిరిగి వచ్చువఱకును ఆకుర్చిమీఁద దయచేయుండి

కుబే—కూర్చుండను. ఆనందాతిశయముచేత నాకేమిచేయుటకును తోఁచకున్నది తాండవమాడవలెనని బుద్ధి పుట్టుచున్నది (నాట్యము చేయుచున్నాఁడు.)

కృష్ణ—(ప్రక్కమొగముగా,) తాళమువేయుటకు దగ్గఱనుండ వీలులేకపోయెను గదా యని విచారించుచున్నాను (వెళ్లుచున్నాఁడు)

కుబే—అంతకాలము సహజప్రేమకాస్పదమయిన నాహృదయము దేనితోఁ జేయఁబడ్డది? నాచెలికాఁడయిన కృష్ణశర్ముఁడన్నట్లు లోహమయమే యయియున్నదా? అయితే కానిమ్ము. ఇపుడది గరఁగఁదగిన సాధనము తటస్థించినది ఇఁక గట్టిపడకుండుఁగాక ఇదిగో! వాండ్రు వచ్చినారు నాచేఁ జేసిన యుపచారములకు హేతువు వారి స్వకార్యపరతయని భ్రమసి వారిపట్ల నెంత యపరాధ మాచరించితిని ఇపుడందుకుఁ బ్రతీకారమాచరించి నాదోషముఁ బాపికొందును మున్నుకంటె నాకిపుడెంత మాఱుదల గలిగినది! (పెద్దకుర్చిపయిఁ గూలుచున్నాఁడు)

విజయ—
విమల—
సుమం—
కృష్ణ—
(ప్రవేశించుచున్నారు)
(విమలా విజయసేనులు చెరియొక
ప్రక్కకు వెళ్లుచున్నారు)

కుబే—నాబిడ్డలారా!

విమల—(కుడిప్రక్కనుండి) చిననాయనా! అస్వస్థముగా నున్నదాయేమి?

విజయ—(ఎడమప్రక్కనుండి) దాహశాంతికేమయినఁ దెచ్చెదను

కుబే—వద్దు వద్దు ఇక్కడ నేయుండు నాజన్మములో ఇంత సౌఖ్యముగానున్న సమయములేదు చిరకాలమునుండి యింత యానందమెఱుఁగను నామనసును దిద్దుకొన్నాను ఇంతేకాదు వెనుకటి యవస్థనువిడిచి నాశరీరమును మాఱినది నేనిపుడు క్రొత్తమనుష్యుఁడ నయినాను ఇందుకు హేతువులడుగకుఁడు నేఁజెప్పఁజాలను. ముఖ్యమయినమాటమాత్రము చెప్పెదను అదిగో! ఆకృష్ణశర్మసత్యచరితుఁడు అతని నిటుక్రితము „పశువు" అని తిట్టితిని ఈదుర్గుణయుతుఁగా నాతని సేనాపరాలప రాధ మియ్యఁదలఁచినాను

కృష్ణ—అయ్యా! అది న్యాయాధికారు లిప్పింపఁదగినదానికంటె నెక్కువ మొత్తము

కుబే—కాని నీవర్హుఁడవయినదానికంటె నెక్కువ మొత్తముగాదు.

కృష్ణ—(వంగి నమస్కరించి, ప్రక్కమొగముగా) లిన గుణముల నెంతలో మార్చుకొన్నాఁడు!

కుబే—విమలా! నీకు మనబంధుఁడయిన సుమంత్రునికి ప్రధానము జరిగెను గదా ఓసుమంత్రా! నా అన్నకూఁతునకుఁ దగినదని చెప్పఁదగిన హారణమునిచ్చి నేనే కన్యధారవోసెదను

విమల—చిననాయనా! నీవు దయామయుఁడవు.

కుబే—కాను. కాను కాని, యింక కాఁగలను విజయసేనా! నీవు పలు చిక్కులపాలయితివి ఆసంగతి నాతోఁ జెప్పవలసియుండెను కాని, యుదారమయిన నీమానసవృత్తిచే వానింగప్పి పుచ్చితివి కానిప్పింక చిక్కు లేదు నీయుత్తమర్ణులందఱితో నేఁ గలసికొని మాటాడి నీచిక్కులు దీర్చెదను.

విజయ—చిననాయనా! ఈయనుగ్రహమునకు నేనేమి చెప్పవలయునో తోఁచకున్నది,

కుబే—ఏమియు నలదు.

విజయ—ఏమిచేయవలయునో అదియు తోఁచకున్నది

కుబే—నేను మీమనసులను నొప్పించినందుకు క్షమింతుననియు, నాజీవితశేష మంతయు నీయొద్ద నుంచుకొని నన్నుఁ గాపాడుదుగుననియు, వాగ్దానముమాత్రము చేయుము ఇందుకుఁ బ్రతిక్రియగా, నానిర్యాణకాలమున నాసర్వస్వమును నీకును నీచెల్లెలికిని ఒప్పగించెదను అది కొలఁదిపాటిసొమ్ముగాదు.

విజయ—నన్నుఁగోరిన వాగ్దానము నేఁజేయుటకు పరమోత్సాహ భరితుఁడనయి యున్నాను నీవు చెప్పిన ప్రతిక్రియ లేకున్నను చేసెదువాఁడనే!

కుబే—నీమాట నేను నిశ్చయముగా నమ్ముచున్నాను. అందువల్లనే, నేఁజెప్పిన ప్రతిక్రియకు నామనసు మరింత యుత్సాహపడుచున్నది ఒకటేమాట! పాతికగడియ క్రిందట నేను, అత్యంత క్రూరజంతువ్రలం దొకఁడనుగానుంటిని ఇపుడు ? సమస్త సుఖసంపత్కాములయినమానవులలో నగ్రేసరుఁడనయితిని! పట్టఁజాలని నాయిప్పటి యానందనమున కంకె నేదియు నడ్డురాదు (కుర్చివెనుకకుఁ జేరగిలఁబడుచున్నాఁడు)

చండసేన—(ప్రవేశించి, కుర్చివెనుక నిలుచుండి, కుబేరసేనుని దృష్టితో తన దృష్టికలిసికొనఁగా) అల్లుఁడా! కుబేరసేనా!

కుబే—ఏమిది! (లేచుచున్నాఁడు)

చండ—(ముందరకువచ్చి) నిన్ను నేను భయపెట్టితినాయేమి?

కుబే—కొంచెము! అయినను మరల స్థైర్యముకలిగినది (ప్రక్కమొగముగా) ఆశ్చర్యకరముగాను!

చండ—నీకుఁగలిగిన పట్టఁజాలని యానందముమాట చెప్పుచుంటివి అందువల్ల మన కుభయులకు జరిగిన ప్రస్తావమును వీరికి వెల్లడించియుందునని తలఁచుచున్నాను

కుబే—లేదమ్మా!

చండ—కనుక, నిప్పుడు చెప్పఁదలఁచినావా?

కుబే—అదియులేదు

చండ—(ప్రక్కమొగముగా) ఇందుల యర్థము నాకుఁ దెలియకున్నది (పయికి అధికారము నభినయించుచు) కొంచెము సేపావలకుఁబొండి —శీఘ్రముగా—మీరంద ఱును —

అందఱు—(నవ్వుచు, నచ్చట నెయుందురు)

చండ—మీరందఱు నిచ్చటనుండి వెళ్లిపోవలసినదని చెప్పుచున్నాను కుబేర సేనునితో నేను రహస్యము మాటాడవలయును తెలిసినదా?

అందఱు—(కుబేరసేనునివైపు చూచుచున్నారు)

కుబే—అక్కక్క-అలేదు (ప్రక్క-మొగముగా తక్కినవారితో) మీరున్నచోటనే యుండుఁడు

చండ—నాకిందుల యర్థము తెలియలేదు నీవు నన్ను చిక్కు-పలుచుచున్నావు

కుబే—చిక్కు-లన్నియు తీర్చి స్పష్టముగాఁ జెప్పెదను విను. భాగ్యవంతునికి బంధువులుచూపు భక్తిప్రపత్తులు అతని ద్రవ్యము నపహరింపవలెనను స్వకార్యపరత చేతనే యని మనమనుకొన్నాము అందువల్ల, అభాగ్యవంతుఁడు, తన ధనము సత్ప్రవర్తకులయిన బంధువుల యధీనముచేసి, దుర్మతులయిన బంధువుల యపహరణము వలననుండి కాపాడుకొనుట మంచిదని యుద్దేశించితిమి ఈమాట స్పష్టముగా తెలిసినదా?

చండ—మిక్కి-లి స్పష్టముగా తెలిసినది

కుబే—అభాగ్యవంతుఁడను నేనే!

చండ—(ప్రక్క-మోముగా) వహావా!

కుబే—పైనఁజెప్పినట్లు ధనము సద్బంధువశముచేయ నుద్దేశించినదియు నేనే!

చండ—(ప్రక్క-మోముగా) ఇఁక ముందుమాటతో వీంద్రకడుపు పగులును

కుబే—కనుక, నాయుద్దేశముచొప్పున, నాద్రవ్యములో సగపాలిప్పుడే నామనఃపూర్వకముగా నాఅన్న బిడ్డలకియ్య నుద్దేశించితిని

చండ—(ప్రక్క-మొగముగా, కుబేరసేనునితో) కుబేరసేనా! నాగతి యేమి కావలసినది!

కుబే—నీవంటి యిల్లాలికి దైవము నిర్ణయించినట్లు—పెక్కు-మాటలేల? నీమాయోపాయములు నాకుఁ దెలిసినవి ఇంటియొద్ద పిల్లది నీకొఱకేడ్చుచుండును ఈపాటికి వెళ్లు

చండ—(క్రోధముతో, కృష్ణశర్మవైపునకు వెళ్లుచు) ఓదుర్మార్గుఁడా! తుదకు నీవు—

కృష్ణ—నేఁగాను! నేఁగాను!

చండ—(కుబేరసేనుని వైపునకు వెళ్లుచు) ఏమయ్యా! ఇట్టి ప్రవర్తనము నీవుద్దేశించి యుండవు ఇది దుస్సహముగానున్నది నాయొడలు నీరయిపోవుచున్నది నాకు మూర్ఛవచ్చుచున్నది

కుబే—ఎవఁడురా!

ఇద్దఱు సేవకులు—(ప్రవేశించి కుబేరసేనునొద్దకు నడచుచున్నారు.)

చండ—అవునవును! మూర్ఖుఁడా! కుబేరసేనుఁడా! నా యసురుఁ బోసికొని యింకను చిరంజీవివయి బ్రతుకుదువుగానిలే అయ్యయ్యో! పడిపోవుచున్నా—

కుబే—(ఆమెను బట్టుకొండని సేవకులకు సైగచేయుచున్నాఁడు)

సేవ—(ఆమెను చెరియొకవైపునఁ బట్టుకొందురు)

చండ—(కన్నులువిచ్చి, సేవకులనుజూచి,) అయ్యయ్యో! (అని కేకవేసి నిలుచుండును) విజయసేనుఁడా నేఁజెప్పనది—విమలా నేఁజెప్పనది—సుమంత్రుఁడా! నేఁజెప్పనది—ఓయి దురాత్ముఁడవయిన శతవృద్ధుఁడా నేఁజెప్పనది—మీకు నేనేవియు చెప్పను (ప్రక్కమొగముగా, ఇందుకు రెండిండ్ల కావల, ఇంకొక ముసలాతఁడున్నాఁడఁట! పించను పుచ్చుకొన్న గొప్పబుడజ్జియఁట పిల్లసంబంధ మతనితో మాటాడెదను (వెళ్లుచున్నది)

కుబే—ఈశీశాపము కొండెములుచెప్పి నామనస్సు మీమీఁద విరసముచేసినది ఈచండివలలోఁ బడక తప్పించుకొని యిప్పుడు బయలఁబడినాను దీనిదుర్బోధలచేత మీయెడ నేను క్రూరముగా నున్నమాట సత్యమే! కాని యిపుడు చాలమచ్చికకు వచ్చితిని కనుక నాపరమవాంఛ యేమనఁగా—నన్ను మీరు పెనుచుఁడు ఇంటి యేర్పాటులు ఈవఱకు వాడుకలోనున్న రీతిని జరిగింపుఁడు మీచేతులతో నా కాహారమిచ్చి పోషింపుఁడు మన్యవ్యాఘ్రము సౌమ్యదర్శనమేయనిచెప్పి మీస్నేహితుల నిటకు తఱుచు రప్పింపుఁడు

అందఱు నిష్క్రమించుచున్నారు.

సంపూర్ణము



గీ. వేఁటకాఁడొకండు పిట్టవేఁటకు వచ్చి
విపినభూమి నొక్కవృక్షశాఖ,
పైనిఁ గూఁడుమండి పావురం బుండంగఁ
గాంచి దానిఁ జంపఁగాఁ దలంచి

గీ. తనతుపాకి తీసి తటుకున గురిపెట్టి
వెనుకవెనుక జరుగువేళ వాఁడు
క్రిందుచూడ కొక్కకృష్ణసర్పముమీఁదఁ
గాఢప్రేరణమునఁ గాలువైచె

గీ. అడుగువేసినంతి నలుకమై నాత్రాచు
పాదమొడిసి కాటువైచె నంత
వేగ నొడలనెల్ల విషమెక్క సోలుచు
శబరుఁ డలతుపాకి జాఱవిడిచి

గీ. ధరణిమీఁద నొరగి తా సాధుపక్షికి
హానిచేయఁబూని తానె యిపుడు
హానిఁ దెచ్చుకొంటి ననివిలపించుచు
నొల్లఁబోయి బోయ యసువులువిడిచె

గీ. క్రూరులైపరుల కకారణంబుగ నుర్వి
హానిఁజేయఁ జూచునట్టివారు
తీఱని కడగండ్లఁ దెచ్చుకొనుచుఁ దామె
దుఃఖపడుదు రాత్మదోషమునకు

ఉ. గ్రక్కునఁజేరి నక్క తమకంబునఁ జచ్చినబోయయొద్ద ము
న్నెక్కిడియున్న వింటిగుణ మిమ్ముగఁ దాఁ గొఱుకంగ దానికొ
మ్మెక్కునఁ దాఁకి తీవ్రముగ నవ్వల వెళ్లినఁ గూలెఁ గావునన్
మిక్కిలిలోభియై నతఁడు మీఁదటి కార్యముఁ గాన నేర్చునే ౯౧

క. మిక్కిలిగఁ గూడఁబెట్టక । తక్కక ధనసంచయంబు రిగుమాత్రము గాఁ
జొక్కముగఁ జేయకుండిన । నక్కొంకుబ్రతుకుగల దయంబుజనేత్రా ౯౨

క. అనువతనిమాట కాంత । వినయంబునఁ బలికె నేను వట్టినె కాలం
బునఁ దిలతండులములదాఁ । చినదానం బులగ మేను జేసెద ననుచున్ ౯౩

ఉ. ఆమఱునాఁడు రేపకడ నాతి తిలల్లను దంచి ముంగిటన్
దామరసాక్షి యుండ నిడ తా గృహకార్యము దీర్చుచున్నచో
నేమఱియున్న నయ్యెడకు నేపునఁ గుక్కట మేగు దెంచి యు
ద్దామలి నువ్వుల ద్రొటిఁ బడంబులఁ జల్లన విప్రుఁ డట్లనున్. ౯౪

క. విను కామాంగకి యాలల । లనయము గొఱ గాంపు । బాహ్యాగారముతో నసున్
గొనిపోయి మార్చి తెమ్మని । పనిచినఁ జని పొరుగుటింట భాషించు నతితిన్ ౯౫

గీ. ఇంటిగృహమేధ యచటికి నేగు దెంచి । యేమి బేరము నా కెద వింతియనిన
నువ్వుఁ బప్పు నాకిచ్చి నేనువ్వులీయ । మాటలాడెద ననిన నామాటకతఁడు ౯౬

క. చేనువ్వులకుం గడిగిన । యీనువ్వులనిచ్చువార లెందును గలరే
మానిని దీనికిఁ గల మే । దేనింగలుగంగ వలయు నిమ్ముగఁ దలఁపన్. ౯౭

వ. అనుమాట లంతకమున్న భిక్షాన్నంబునకున్ బోయి నేనువింటి నిమ్మాషికం
బును గారణంబులేక యొంటినిచ్చుట వసియింప నెందనిబ్రహ్మస్థగుండు చూడా
కర్ణునకుం జెప్పిన నతండు ౯౮

క. తనభిక్షాన్న మశంకం । గని నిచ్చలు నొంటినరిగి గర్వోద్రేకం
బున నోలసి మీఁదఱుంగక । తనియెడియా కారణంబు తెలిసినవాఁడై ౯౯

గీ. వాఁడికొయ్యను నాయున్నవలను గ్రోచ్చి । పెద్దగాలంబునను గుడఁ బెట్టినట్టి
ప్రోదిధన మెల్లఁ గైకొని పుచ్చుకొనియెఁ । గఠినహృదయుఁడై యతఁ డదిగాన నేను

క. ధనహీనుఁడైన నాకుం । దనుశక్తియుఁ బౌరుషంబుఁ దఱిగిన కతనన్
వినుమాహారము మాత్రం । బును దొరకించుటకు వెరవుపుట్టకయున్నన్ ౧౦౧

వ. అయ్యతీశ్వరుని భిక్షాపాత్రం బెట్టకెలకుఁ గదల్చుచున్నం గనుంగొని యదల్చు
చూడాకర్ణుం గాంచి ౧౦౨

క. ఘనధనమంతయుఁ గైకొ । న్నను భిక్షాపాత్రదివియ నడయాడుచు నే
నును నల్లనల్ల వెనుకకుఁ । జనఁదొడఁగఁగ భిక్షుకుండు చతురతననియెన్ ౧౦౩
క. ధనవంతుఁడె బలవంతుఁడు । ధనవంతుఁడె యోగ్యుఁడరయఁ దానధికం బ
య్యును ధనహీనత నెలుకది । తనజాతింగూడెఁ బాపతాపముపేర్మిన్ ౧౦౪
వ. అని మఱియును ౧౦౫
ఉ. భూరిధనాఢ్యుఁడున్ మిగులబుద్ధివిహీనుఁడునైన మానవున్
జేరవుమంచికార్యములు చెప్పఁగ నేటికి వానిదైనసం
సారముఁ జెప్పఁజూపఁగ నసారమగున్ దలపోసి చూడ ని
స్సారపుమందువేసవిని సన్నపువాహిని లింకుకైవడిన్ ౧౦౬
క. కలవాఁడె వెలులుచుట్టలు । కలవాఁడగు నలఁడు బుద్ధిగలవాఁడునగున్
లవి నతఁడె లోకపూజ్యుఁడు । బలవంతుఁడు నతఁడె వంశపావనుఁడెందున్
క. పరదేశ మెనిజదేశము । పరులే బాంధవులు ద్రవ్యసంపన్నులకున్
ధరణి నసాధ్యం బెయ్యది । పరమార్థము ధనముసూవ ప్రజలకునెల్లన్ ౧౦౭
క. కులసతరోయును జుట్టం । బులు వాయుదు రోరులు గట్టుపుంబలుకుల ని
ష్ఠుల నాడఁదొడఁగుచుందురు । కలియుగమున ద్రవ్యహీనుఁ గలకాలంబున్
క. మృతనొందిన జనుసైనను । హితులెల్లను డాయుదురు మహీస్థలిలోనన్
మతిఁదలఁపఁ బేదఁ జేరరు । బతిమాలిననైన సఖులు బంధులునెపుడున్ ౧౧౦
ఉ. చుట్టములేనిదేశమును సూనుఁడులేని నికేతనంబునున్
జెట్టతనంబు మూర్ఖునచిత్తము శూన్యము లంతకంటె నే
పట్టుననెల్లవారు గనుపట్టకహీనదశం జరించువా
నెట్టన సర్వశూన్యుఁడని నిందితుఁడయ్యె దరిద్రుఁడెంతయున్ ౧౧౧
చ. అమరు నిరాకులేంద్రియములన్నియు నప్రతిమానబుద్ధియున్
బ్రమదితవాక్యపద్ధతియుఁ బాయక తొల్లిటివే మనుష్యుఁ డ
ర్థముఁ బెడబాసె నేనియును దప్పదు మున్నిటినామమైనఁ జి
త్రము క్షణమాత్రరూపు వికృతింబగు వానికఘోరభంగిగా ౧౧౨
వ. అది నిమిత్తంబుగా నేనచ్చటనుండనొల్లక యొండొక్కచోటికిం బోయితిఁ
బోదుఁగాకేమి నేనొక్కనినదుగంజాల నెట్లనిన వడిగెడువాఁడుజీవన్మృతుం
డట్టివాని తెఱంగువినుమని యిట్లనియె ౧౧౩
చ. నడువఁగఁదొట్రుపాటొదవు నాలుకయాడదు మాటలాడఁగాఁ
దొడఁగిననీరలుంగు వదుఁ దొల్లిటి పొంక ముడొంక దేహమున్

వడఁకు భయంబుఁగ్రమ్మి దురవస్థలఁదల్లడ మందు వేఁడుచోఁ
జెడుగగు నర్థికిన్ మరణచిహ్నములన్నియుఁ దోఁచునారయన్. ౧౧౪

గీ అర్థహీనుఁడైయుండెడు నంతకంటె। వహ్నిలోపలఁ దగమేను వైచుటొప్ప
యాచకుఁడు వేఁడ నీలేని యధమలోభి। జన్మమేటికి వానిసంసారమేల ౧౧౫

సీ వఱలు దారిద్ర్యంబునవలన సిగ్గుజనించు సిగ్గున సత్త్వంబు శిథిలమవును
సత్త్వహీనుఁడు తిరస్కారదూషితుఁడగుఁ బరిభవయుక్తు నన్నరుఁడు బెగడు
బెగడినవాఁడు నెవ్వగలచే దురటిల్లు నధికదుఃఖితుబుద్ధి యడఁగిపోవు
బుద్ధిహీనుండును బొడవడంగును వేగఁ బొడవడంగినఁ గీర్తియడఁగుఁ దాఁ బ్ర
నట్లుగావున నిర్ధనుండైనవాఁడు। బహువిధంబుల నీ చెప్పఁబడినయట్టి
యాపదలకెల్ల మూలమై యార్తిఁ బొందు। నెవ్విధంబున నతఁడెన్న నీడుగాఁడు

వ అనిమఱియు హిరణ్యకుండు ౧౧౬

చ పరగ నసత్యవాక్యములు పల్కుటకంటెను మౌనవృత్తి మే
లరయఁగ నన్యభామఁగదియంజనుకంటె నపుంసకత్వవి
స్ఫురణము మేలు కొండియము పూనుటకంటెను జావుమేలగున్
బరధనకాంక్షకంటె సులభంబగుభిక్షము మేలు చూడఁగన్ ౧౧౭

చ చెడు నభిమాన మార్యునకు సేవకలంబున సాంద్రచంద్రికన్
జెడుఁ దమమంతియున్ దెవులుచేఁ జెడుఁ జక్కఁదనంబు పాపముల్
చెడుఁ బరిశంభు కీర్తనముచే శతచోద్యగుణంబులైననున్
జెడు నొరువేఁడఁబోవుటకుఁ జేరినయర్థిక నెల్లభంగులన్ ౧౧౮

వ కావున నొక్కరినడిగిన వారు పెట్టుటకష్టంబగుట నెవ్విధంబున బ్రతుకనేర్తు
నెవ్విధంబున మృత్యుముఖద్వారంబు దొలంగుదుఁ జిరప్రవాసియుఁ బరాన్న
భోజియుఁ బరగృహవాసియు నయిన మానవుండు బ్రతికియుఁ జచ్చినవానితో
సమానుండు వాఁడు జీవితుండైయుండుటకంటె మృతుండగుటయె మేలని విచా
రించియును ధనాపేక్షవయ్యలీశ్వరుం గాంచ నాగ్రహించి కదిపిన నన్నెఱింగి
బృహస్ఫిగుండు కృతాంతదండంబువోని ప్రచండదండంబున నన్నుదండించిన
సాభిలాషంబున సంతోషంబులేనినన్ను నాత్మద్రోహిఁగా నెఱింగిలి నెట్లంటేని

గీ నిత్యసంతోషవంతుఁడై నెగడువాని। కన్నిచోటుల సంపద లానియుండుఁ
జెప్పులిడికొన్నకాళ్లకు కీడు తలంపు। తోలుగప్పిన చందమైతోఁచునట్లు ౧౨౧

వ అని మఱియును ౧౨౨

శా. సంతోషామృతతృప్తి నూఁదినమదిన్ గాంతాత్ములైనట్టి ని
శ్చింతుల్ గాంతురు నిత్యసౌఖ్యమహిమల్ సిద్ధంబు సాపేక్ష న
త్యంత క్లేశగతాగత భ్రమణదుర్వ్యాపార మోహాకుల
స్వాంతుల్ గానఁగ నేర రవ్విధము లేశంబున్ వృథాయాసతిన్ ౧౨౩

గీ. ఆశమిగులంగఁగల్గిన యన్నరునకుఁ । గడల నూత్నామడయు దవ్వుగాకయుండు
నిత్యసంతోషియైనట్టి నిర్ధనునకు । ధనము చేపడ్డ నందు నాదరము లేదు ౧౨౪

వ. అట్లుగావున గర్వవంతుండును వివేకియు నయ్యునేనియుం గాంచనరత్నసాంగత్య
సామ్యంబుఁ నొందిల్లు లోకదృష్టాంతంబును వినంబడియుండు నెట్లంటేని ౧౨౫

ఉత్సాహ. భూతదయకు మిగులఁగల్గు పుణ్యమున్ బ్రభూతరో
గాతురంబుగాక దేహమమరుకంటె సౌఖ్యమున్
బ్రీతికపటమింతలేని పేర్మికంటె స్నేహమున్
ఖ్యాతినిర్ణయించు కంటెఁ బండితత్వమున్నదే ౧౨౬

వ. అది నిమిత్తంబు నాకుఁబుట్టినవిచారంబు కతంబున భవదంతికంబునకుం జను
దెంచితిననినవిని మిత్రమందరుం డిట్లనియె ౧౨౭

క. సురనరకిన్నరపన్నగ । గరుడాసురపక్షిపశుమృగంబులు లోనై
పరఁగిన లోకక్రియయును । బరువడి నాహారముఁగోనుఁ బగలిటి లోనన్ ౧౨౮

క. కావున నాహారార్థము । కావింపఁడు నింద్యమైన కార్యము ప్రాజ్ఞుం
డీవును బరోపకార । ప్రావీణ్యముమై ప్రయాస పడుటొప్పుఁగదా ౧౨౯

ఉ. మానవుఁడెంత ధర్మవిధమార్గమెఱుంగఁగలేని సేవల
జ్ఞానియయేని లేరు ఫలసంపద నీతికిఁబాసి యుద్యమ •
శ్రీ నెఱయంగలేని నరుఁ జెందిన మంచిగుణంబుగల్గినన్
గానఁగరాక పోవు మఱి కార్యము రాదు మనోవిహీనతన్ ౧౩౦

గీ. అచ్చుపడు నీతిశాస్త్రంబు నచ్చెనేనిఁ । బోరి నిరుద్యోగి ఫలసిద్ధిఁ బొందలేఁడు
తెల్ల మంధునందు కరమువదీపమున్న । నేనియు చటిపదార్థంబుఁ గానలేఁడు ౧౩౧

వ. అని చెప్పి మఱియును ౧౩౨

సీ. ఒకవేళ దారయాచకవృత్తిమైనుండు యాచకుండొకవేళ ననుసుదాత
యొకవేళ శాత్రవనికరంబు ఖండించు నొకవేళ నిలువక యోడిపోవు
నొకవేళ సంపద నుప్పొంగుఁ బైపయి నొకవేళఁగడుపేద నొందియుండు
నొకవేళ మిత్రమిత్రకళత్రయుతుఁడగు నొకవేళ నొక్కఁడు నొదిగియుండు

హెచ్చుగుందులు తఱుచుగా నెల్లయెడల । నెవ్వరికినైనఁ గలుగుచోనివ్విధమున
భాగ్యవంతుఁడు కొనసాగి బ్రతికియుండు । భాత్రినదిగాన భాగ్యప్రధానమరయ

వ కావున దేశకాలంబులతెఱం గెఱుంగునది ౧౩౪.

క వనమునఁబుట్టిన శాకము । లనయము భక్షింపఁదనకు నాఁకలిచెడదే
విను మును స్వోదర పోషణ। మునకెవ్వఁడు గష్టవృత్తి మొనసెంజెపుమా. ౧౩౫.

వ అనియిట్లు హిరణ్యకునూఱడించి యిట్లనియె ౧౩౬

సీ అవివేక శాస్త్రంబు లభ్యసించినయేని నతఁడు మూఢుఁడుగాని ప్రతిభలేగు
చదివినశాస్త్రంబు సకలార్థము నెఱింగి యవ్విధంబును దానునాచరించి
యడిగినవారికి నర్థంబు దెలియంగ వివరించునతఁడు వివేకిగాన
నివ్విధంబునకును దృష్టాంతమైనయర్థంబు నొప్పంగనుదాహరింతుఁ
దెవ్వులుగొన్నట్టి వానికిఁ దిపురమందు । చేసిసేవింపనొసఁగక చేతనిడిన
మానసేర్చునె రోగంబు మదిఁదలంపఁ। జదువుపనిలేదు భాగ్యంబుచాలకున్న ౧౩౭

క నెలవులువిప్పిన మిగులం । బలుచన నఖదంతకేశమానవులపనుల్
తలపోసి బుద్ధిమంతులు । దొలఁగరు తమతావులెంతి దుర్దశనైనన్ ౧౩౮

త్రిపలికి మిత్రమందరుండవ్విధం బల్పవిచారికార్యం బార్యప్ తెఱంగువినుమని
యిట్లనియె ౧౩౯.

వ ఇరవులరాఁ ౦ నిక్కలుచూచుచుఁబోయిపోయి కే
సరులు గజ సుజనసంఘము నెమ్మదినుండుఁ జాలదు
స్తరమగు న్వెడలఁ జాలక తెరకిన యుండిడస్సి యు
ర్వర మ కశా పురుషవర్గము దుర్గతి పొందునెంతయున్. ౧౪౦

సీ వివేకదీపితుండును నైన ప్రభునకుఁ బరదేశ భయములేదు
క్రమోన్నిద్ర భద్రశైల నాత్మీయులును దాను ననుభవించు
విను సింహ మేఘోద్దువసింహంచు నడవిఁగాకొండొకయెడవినైన
జంతువులందు నాల్గియపౌరుషోద్యుక్తకి నమకోనియుక్తమెఱసి
శసన్నిభనఖముఖాంకుశవిభిన్న మదభరాభీల కుంభికుంభప్రకీర్ణ
నాంసరక్తానుభవమోదమానసమునఁ బొదలు ముండును నెంతొయొప్పిదముగాఁగ

గీ । అమర మందూకములు పల్వలమును బత్తు । లరసికాసారమును జేరనరుగుకరణి
నధికధనములుసత్సహాయ కుందివిజ । ధరణినుద్యోగిఁబ్రాపించుఁదమకుఁదామ.

వ అవ్విధంబెట్టిదనిన ౧౪౩.

చ వఱపున మేనులెండఁ దమవారియెడం బెడఁబాసి జీవముం
దొఱఁగి ధరిత్రిడింది యతిదుర్దశఁ గాలముపేచి యుండఁగా
నుఱవగు వాన ద్రోణముల నొయ్యన నూల్కొన నున్నవోలె నే
ర్తెఱఁ గనుపట్టుభేకవితతింగని యుత్సవ మొప్పఁజేయఁగన్ ౧౪౪

వ అనిచెప్పి వెండియు ౧౪౫

శా ఆలస్యంబును గామినీజన రతివ్యాసక్తియున్ జన్మభూ
లోలత్వంబును రోగమున్ ఘన భయోల్లోభంబు సంతోషమున్
బోలంగా నివి యాఱు నెప్పుడు జగత్ప్రాజ్యప్రతాపోదయ
శ్రీలంజెందఁగ విఘ్నకారణములై చెల్లున్ ధరామండలిన్. ౧౪౬

వ కావున నివి యాఱుగుణంబులు పరిహరించినపురుషుం డభీష్టసంపదలు ప్రాపించు ప్రాప్తంబులైనసుఖదుఃఖంబులవలన మోదఖేదంబులం బొరయకుండునది ౧౪౭

గీ చక్రపరివర్తనమువోలె జనులకెల్ల । సౌఖ్యదుఃఖంబు లెడనెడసంభవించు
వానిఁగైకొని యాత్మవిజ్ఞానమహిమ । బుధులు మోహఖేదంబులఁ బొరయరెందు

సీ వర్ధితోత్సాహుఁడై వలయుకార్యములందు దీర్ఘసూత్రుఁడు కాక తెలివిగలిగి
పనులఁ బ్రజ్ఞల్భుఁడై బహుకార్యములతిటి వినుపకేమిట నతివ్యసనిగాక
మిగులశూరుండైన మేలెఱుంగుటగల్గి దృఢచిత్తుఁడై స్థిరతలోడవ
మితసత్వ భాషణోన్మేషంబు సంధిల్లఁ బుణ్యకృ ద్ధినిలిపి
యుండుపురుషుని గుణములయోజ దెలిసి । యింటి సుదానెయేగుదెంచి
సంచలింపక తాఁబ్రతోపించిమించి యంచితంబుగఁ సేవించు నెపుడు

క ఉద్యోగరహితు నలసుని । నుద్యత్సాహసవిహీను నొల్లఁ సం
పదొగ్యసుఁ గొల్వఁజేరదు । చోద్యము గావృద్ధుఁ దరుణి చూ ౧౫౦

వ కావుననీకుద్రవ్యసంపత్తి గలుగకున్నను బుద్ధిసముత్సాహం టంజేసి
బ్రతుకంగలవాఁడవని పలికి వెండియు ౧౫౧

చ ఘనుఁడొకవేళ లేమిఁ గడుఁ గందినఁ జుల్కదనంబుగాదు హీ
ననరుని కొక్కచోటను ధనంబొదవ గూడిన దొడ్డవాఁడుగాఁ
డనయము హేమమాలికల నందముగాఁ గయిచేసిరేనియున్
శునకము విక్రమస్ఫురణసొంపున సింహముఁ బోలనేర్చునే ౧౫౨

సీ శౌర్యసముత్సాహ ధైర్యసారంబులఁ బురుడు చెప్పఁగ రానిపురుషవరుఁడు
జలనిధి గోష్పదస్వల్పమాత్రంబుగా నమరాద్రి వల్మీకసమముగాఁగ

దలఁచు నహీనసత్వ ప్రతాపోజ్జ్వలునగరిలో నవనిధానములతోడ
సంతతసంతోషితాంతరంగంబున శ్రీదేవి నిశ్చలస్థితివహించు
నట్టిపుణ్యులు తఱుమగాఁ బుట్టరవనిఁ। బుట్టిరేనియు సుజనసంపూజ్యులగుచు
నెన్నికకు నెక్కు నూటవెయ్యింట నొకఁడు। గర్భనిర్భాగ్యులెందఱో గలుగనేల

క. అమరాద్రిపొడవు పాతా। ళములోఁతు మహాబ్ధివిరివి లఘుతరములుగాఁ
దమచిత్తంబునఁ దలఁపుదు। రమరఁగ నుద్యోగవంతులైన మహాత్ముల్ ౧౫౪

వ. అనిన హిరణ్యకుండు మిత్రమందరునకట్లయె ననఘా నీవుచెప్పిన హితవచనంబు
లాకర్ణించుటంజేసి నాచిత్తంబునంగల కలంకయంతయుఁ దీఱె నని మఱియును

మ. ధనవంతుండవు నిన్నుగర్వమిసుమంతం జేర దిబ్బంగినే
నను నర్థోత్కర నాశదైన్యమును మేనంజెందనీ నెప్పుడున్
మనుజుండొక్కెడఁ బాటులంబడుట సామ్రాజ్యంబు గైకొంటనుం
గనుఁ దానేర్పరిచేతికందుకమురేఖన్ బెక్కుచందంబులన్ ౧౫౬

మ. ఖలసంసర్గము యౌవనాభ్యుదయమున్ గాంతాజనస్నేహమున్
జలదచ్ఛాయయు ద్రవ్యసంపదయు నైజం బల్పకాలోపభో
గ్యలసత్సౌఖ్యకరంబులంచు నివివేడ్కన్ మెచ్చరార్యుల్ మదిన్
విలసత్స్థాన సమాధినిర్మలగుణావిర్భూతచేతస్కులై ౧౫౭

క. అదిగాన నర్థహానిక। హృదయంబునఁదలఁక నించుకేనియు ననునిం
పొదవఁగ బోధించిననీ। సదమలవాక్యములు నను బ్రశాంతునిఁజేసెన్ ౧౫౮

వ. అనిన మిత్రమందరుండు హిరణ్యకునకిట్లనియె ౧౫౯.

ఉ. తోడనె యర్థసంపదలతోఁ బ్రభవించినవాఁడులేఁ డొడం
గూడినద్రవ్యమెల్ల ననుకూలముగా శతహాయనంబులన్
వేడుకలారఁగా ననుభవించినవాఁడును లేఁడు గాన నే
నోడను బూర్వసంచితము యోగ్యమె నాకును నెల్లవారికిన్ ౧౬౦

ఉ. దానముకంటె వేఱొకనిధానములేదు ముదంబుకంటె నిం
పైనధనంబులేదు కొనియాడెడు శీలముకంటె భూషణం
బేనెఱి లే దరోగమునవింపగుదేహముకంటె లాభమున్
గానఁగనెందులే దనఘ గౌరవబుద్ధిఁదలంచి చూచినన్ ౧౬౧

క. పెక్కులుపలుకంబనిలే। దెక్కడికిఁ బోవవలుప దేనును నీవున్
దక్కకకూడుకయుండుద। మిక్కడ నతిసౌఖ్యవృత్తి నింపెసలారన్ ౧౬౨

వ. అనిన హిరణ్యకుండిట్లనియె ౧౬౩.

గీ. మిత్రమంథర నీసుచరిత్రమహిమ । మఖిలజనులకుఁ గొనియాడ నాస్పదంబు
గాన నాకును సంతోషకరము గాదె । నిన్నుఁ గనుఁగొన్న నాభాగ్య మెన్న నెల

ఉ. ఉన్నతుఁ డైన మానవున కొక్కెడ యొదవన్ గడుఁగీడు వొందినన్
సన్నపువాఁడు దీర్చుటకు శక్తుఁడె యంతటివాఁడు వాఁడుగా
కన్న నఁబంకమగ్నమగు నట్టిగజేంద్రుని నెత్తి నేనుఁగుల్
పన్నగ నోపుఁ గాక మృగపంక్తులు హీనము లంత కోపునే ౧౬౫.

ఉ. దేవబలాఢ్యుఁ డైనతఁడు ధీరమతుల్ గొనియాడ నొక్కచో
దైవిక మైనకీడు దనుఁదాఁకిన నోర్చి సమస్తకార్యసం
భావితబుద్ధి మైఁ బ్రకృతిబాంధవులాపదఁ బొందివచ్చినన్
జేవదలిర్ప వారలకుఁ జెందినదుఃఖము మాన్పు నెయ్యుఁడై ౧౬౬

చ. పరువడి నెల్లనాఁడు బుధబాంధవకోటి సుఖింపనుండువాఁ
డరుదుగఁ దన్నుఁ జేరుశరణార్థుల నర్థులఁ జింతితార్థసం
భరితులఁ జేయువాఁడు కులపావనుఁడై వెనుఁబొందువాఁడు పో
పురుషవరణ్యుఁడౌ యమరపూజ్యుఁడు కారణజన్ముఁడీమహిన్ ౧౬౭

వ. అని మఱియును ౧౬౮

ఉ. మారుతముల్ వనంబులను మానుగ షట్పదపంక్తి పువ్వులన్
హారివిహారిచారుకలహంసము లంబులఁ బక్షు లంబరా
ధారముఁ గోరినట్లు ప్రమదంబుగ నేను నిన్నుఁ జూడఁ గాఁ
గారణమౌటఁ జేసి ఫలకాంక్షలఁ జేరితి మివ్విధంబునన్ ౧౬౯

వ. అని యిట్లు మిత్రమంథర లఘుపతన హిరణ్యకులు తమలోపల సంభాషణంబులఁ బ్రొద్దుపుచ్చు సమయంబున ౧౭౦

క. సారంగ మొకటి మృగయుని । బారిం బొరిఁ దప్పి బెదరి భయవివశతతన్
గూరి పఱతెంచి నంతటఁ । జేరువఁ బొడగాంచి వారు బిడిముడిపడుచున్ ౧౭౧

వ. మిత్రమంథరలఘుపతన హిరణ్యకులు మృగంబు తీవ్రగమనంబు చూచి వెఱచుచుఁ గనికని బఱచి రంత లఘుపతనుం డచ్చేరువ నొక్కమహీరుహం బెక్కి భయంబు దక్కి నిక్కిచూచి యామృగంబుపజ్జఁ దక్కిన క్రూరమృగవ్యాధబాధలు లేకుండ నిరీక్షించి మిత్రమంథరహిరణ్యకులం జేర్కొని వెఱవకరండని పిలిచిన నయ్యిరువురు వృక్షంబుపొంతకుం జనుదెంచి నితాంతభయభ్రాంతుండును గంపితశరీరుండును నగు చిత్రాంగదుండను మృగసత్తము నాలోకించి వారలలో మిత్రమంథరుండమందానందకందళితహృదయారవిందుఁడగుచు దాని సంబోధించి యిట్లనియె. ౧౭౨